# పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 214 | విశాఖపట్నం | 5-5-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 214 | VISAKHAPATNAM | 5-5-2026 TUESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM | UPI
yono SBI | BHIM SBI Pay
G Pay | Paytm | Pay






శ్రమదానంతో గెడ్డపై వంతెన నిర్మాణం..

మమితా బైజుకు బ్యాడ్ టైమ్ స్టార్ట్ అయ్యినట్టుందే!




ఈ లక్షణాలు కనిపిస్తే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం సరిగ్గా లేనట్లే.. !




**తమిళనాడు ఎన్నికల ఫలితాలు**

మొత్తం స్థానాలు: 234

| | |
|---|---|
| టీవీకే | 105 |
| డీఎంకే | 75 |
| అన్నాడీఎంకే | 54 |

**కేరళ ఎన్నికల ఫలితాలు**

మొత్తం స్థానాలు: 140

| | |
|---|---|
| యూడీఎఫ్ | 102 |
| ఎల్‌డీఎఫ్ | 35 |
| ఇతరులు | 3 |

**అస్సాం ఎన్నికల ఫలితాలు**

మొత్తం స్థానాలు: 126

| | |
|---|---|
| బీజేపీ | 102 |
| కాంగ్రెస్ | 21 |
| ఏఐయూడీఎఫ్ | 2 |
| ఇతరులు | 1 |

**పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలు**

మొత్తం స్థానాలు: 30

| | |
|---|---|
| ఏఎన్ఆర్‌సీ | 17 |
| కాంగ్రెస్ | 6 |
| ఇతరులు | 7 |

**పశ్చిమ బెంగాల్ఎన్నికల ఫలితాలు**

మొత్తం స్థానాలు: 293

| | |
|---|---|
| బీజేపీ | 204 |
| తృణమూల్ కాంగ్రెస్ | 84 |
| కాంగ్రెస్ | 1 |
| ఇతరులు | 4 |

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** తమిళనాడులో సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ అద్భుత విజయం దిశగా పయనిస్తోంది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలకు భిన్నంగా ఆ పార్టీ ఆధిక్యం పరంగా మేజిక్ ఫిగర్ సమీపానికి వచ్చింది. 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సిన సీట్లు 118. మధ్యాహ్నం రెండు గంటల వరకు వచ్చిన ఫలితాలను చూస్తే, టీవీకే 111, అన్నాడీఎంకే 63, డీఎంకే 59 స్థానాల్లో ముందంజలో ఉన్నాయి.

పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో విజయం దిశగా బీజేపీ దూసుకెళ్తోంది. అస్సాంలో గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీనే విజయ ఢంకా మోగించగా.. తాజాగా మూడోసారి విజయకేతనం ఎగరవేస్తోంది. మొత్తం 126 స్థానాలకు గాను బీజేపీ 99 స్థానాల్లో ఆధిక్యం కనబరుస్తోంది. పశ్చిమ బెంగాల్‌లోనూ కమలం పార్టీ సత్తా చాటుతోంది. మొత్తం 294 స్థానాలకు గాను 197 సీట్లలో బీజేపీ ముందంజలో ఉంది. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ కేవలం 93 స్థానాల్లోనే ఆధిక్యం ప్రదర్శిస్తోంది. దీంతో పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం దాదాపు ఖాయమైనట్లు కనిపిస్తోంది. ఈ సందర్భంగా అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో, అలాగే దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. కాషాయ దుస్తుల్లో రోడ్లపైకి వచ్చిన ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. మొత్తం 140 స్థానాలకు గాను యూడీఎఫ్ ఏకంగా 101 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతూ మ్యాజిక్ ఫిగర్ 71ని సునాయాసంగా దాటేసింది. ఈ విజయంతో కేరళలో ప్రతి ఐదేళ్లకోసారి అధికారం మారే సంప్రదాయం మళ్లీ మొదలైనట్లు కనిపిస్తోంది.

## ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్..
# చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో తయారయ్యే స్థానిక ఉత్పత్తులను ప్రపంచ స్థాయి బ్రాండ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్పత్తుల నాణ్యతను పెంచడంతో పాటు, వాటికి ప్రపంచ మార్కెట్ కల్పించేందుకు అవసరమైన పటిష్ఠమైన ప్రణాళికలతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఏపీ సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో 'ప్రొడక్ట్ పర్ఫెక్షన్ క్లస్టర్ల' ఏర్పాటుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఈ క్లస్టర్లు చోదకశక్తులుగా మారాలని ఆకాంక్షించారు. పారిశ్రామిక క్లస్టర్లకు సమగ్రమైన లాజిస్టిక్స్ కనెక్టివిటీని అందించడం అత్యంత కీలకమని సీఎం నొక్కిచెప్పారు. ఉత్పత్తుల తయారీ కేంద్రాలకు రోడ్డు, రైలు, పోర్టు మార్గాలను అనుసంధానం చేయడం ద్వారా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. రవాణా వ్యయం తగ్గితేనే ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్‌లో పోటీతత్వం పెరుగుతుందని, అంతిమంగా పరిశ్రమలకు, రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. ఈ క్లస్టర్లకు నీరు, విద్యుత్, కోల్డ్ చైన్, వేర్ హౌసింగ్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ మ్యాపింగ్ జరగాలని సూచించారు.

సమీక్షలో భాగంగా విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్లపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వ 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) పథకం కింద చేపట్టనున్న పారిశ్రామిక, కెమికల్ పార్కుల అభివృద్ధిపై సీఎం అధికారులతో చర్చించారు. 2026-27 నాటికి ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్క్, ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌తో పాటు 175 ఎంఎస్ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేసే అంశంపై ప్రణాళికలను పరిశీలించారు. పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు గ్రామీణ ప్రాంతాలకు, రైతులకు కూడా అందాలని సీఎం ఆకాంక్షించారు.

## విజయ్‌కి అభినందనలు: జగన్



**తాడేపల్లి, పతాకం న్యూస్:** దేశ వ్యాప్తంగా నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతున్న వేళ ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ స్పందించారు. ముఖ్యంగా తమిళనాడులో నటుడు దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) తొలి ఎన్నికల్లోనే సంచలన ప్రదర్శన చేయడంపై ఆయన ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు జగన్ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. "నా ప్రియ సోదరుడు విజయ్‌కు హృదయపూర్వక అభినందనలు. రాజకీయాల్లోకి వచ్చి, తొలిసారి పోటీ చేసిన ఎన్నికల్లోనే అతిపెద్ద పార్టీగా అవతరించడం నిజంగా గొప్ప విషయం. ప్రజాసేవలో మీరు ప్రారంభించిన ఈ కొత్త అధ్యాయంలో మీకు మరింత శక్తి, విజయం చేకూరాలని ఆకాంక్షిస్తున్నాను. దేవుడు మీకు తోడుగా ఉండాలి" అని జగన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## అల్లూరి జిల్లాలో వడగండ్ల వాన.. చెట్టు కూలి
# ఇద్దరు మృతి



**అల్లూరి జిలా, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లాలో సోమవారం వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటలపాటు వడగండ్ల వర్షం కురిసింది. ఈ వర్షానికి ముందు వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని వాతావరణం చల్లబడింది. కారుమబ్బులు కుమ్ముకున్న అనంతరం ఉరుముల మెరుపుల వడగండ్ల వాన ఒకేసారి రావడంతో వారపు సంతకు వచ్చిన వ్యాపారాలు వినియోగదారులు తలదాచుకోవడానికి అష్టకష్టాలు పడ్డారు. వారపు సంత బురదమయంగా తయారైంది. చిరు వ్యాపారులకు నిలువనీడ లేకుండా పోయింది. మళ్లీకు తెచ్చిన కూరగాయలు ఎక్కడికక్కడే వదిలేసి ఉరుకులు పరుగులు తీశారు. మెరుపు ఉరుముల శబ్దానికి సంతకు వచ్చిన ప్రజలు బెంబేలెత్తిపోయారు. వర్షం ధాటికి పాత ఎంపీడీఓ క్వార్టర్స్ ఎంపీపీ నివాస సమీపంలోని ఓ చెట్టు కూలిపోయింది. ఆ చెట్టు కూలిపోవడంతో ఆ చెట్టు కింద చిరు వ్యాపారం చేసే ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## సంకెళ్లు..

'వార్తాపత్రికలు లేని ప్రభుత్వం కంటే, ప్రభుత్వం లేని వార్తాపత్రికలనే నేను కోరుకుంటాను- అన్న థామస్ జెఫర్సన్ మాటలు ప్రజాస్వామ్యంలో పత్రికల ప్రాముఖ్యతను చాటిచెబుతాయి. ప్రజాస్వామ్యానికి మీడియా అద్దం వంటిది. సమాజంలో జరుగుతున్న వాస్తవాలను, అన్యాయాలను, ప్రజా సమస్యలను, ప్రజావ్యతిరేక ప్రభుత్వ నిర్ణయాలను నిష్పక్షపాతంగా చూపిస్తుంది. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే మీడియా బలంగా వుండాలి. -ప్రజాస్వామ్యానికి మీడియా నాలుగో స్తంభం- అంటారు. అయితే, ప్రజాస్వామ్య దేశమైన భారత్ లో మీడియా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. తాజాగా విడుదలైన 'ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీ-2026-లో భారత్ 157వ స్థానానికి పడిపోయింది. మన పొరుగుదేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ లు మనకంటే మెరుగ్గా వుండటం గమనార్హం. ప్రపంచంలోనే అత్యుత్తమ పత్రికా స్వేచ్ఛ వున్న దేశాల్లో గత పదేళ్లుగా నార్వే మొదటి స్థానంలోనే వుంది. గతేడాది 151గా వున్న భారత్ ర్యాంక్ ఇప్పుడు ఏకంగా ఆరు స్థానాలు దిగజారడం ఆందోళనకరం. ఇది కేవలం ఒక అంకె మాత్రమే కాదు. మన ప్రజాస్వామ్య ఆరోగ్య స్థితికి సూచిక కూడా. అమెరికా సైతం గతం కంటే ఏడుస్థానాలు పడిపోయి, 64వ స్థానానికి చేరింది. ఇక్కడ మోడీ, అక్కడ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలే దీనికి కారణమని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'లోపాలను నిర్భయంగా ఎత్తిచూపడమే పత్రికల ఉద్దేశ్యం- అని గాంధీ అంటారు. అయితే, ఇటీవల కాలంలో ఈ 'నిర్భీతి'కి భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది. అణచివేతను ప్రశ్నించే స్వతంత్ర మీడియా సంస్థలు, జర్నలిస్టులపై దేశద్రోహం, యుఎపిఎ వంటి కఠిన చట్టాలను ప్రయోగించడం ఆందోళనకరం. ముఖ్యంగా పరిశోధనాత్మక జర్నలిజం చేసే వారిపై 'జాతీయ భద్రత' పేరుతో దాడులు జరుగుతున్నాయి. ఇటీవల ప్రతిపాదించిన ఐటీ రూల్స్-2026 ముసాయిదా ప్రకారం, సోషల్ మీడియాలో వార్తలపై వ్యాఖ్యానించే సాధారణ వ్యక్తులను కూడా 'పబ్లిషర్లు'గా పరిగణించే అవకాశం ఉంది. ఇది భావప్రకటన స్వేచ్ఛను హరించడమే కాక, డిజిటల్ మాధ్యమాల్లో స్వతంత్ర గొంతుల భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగించడమే. 2025లో భారత్ ప్రపంచంలోనే అత్యధికంగా 65 సార్లు ఇంటర్నెట్ షట్‌డౌన్లను విధించి, ఈ విషయంలో ప్రజాస్వామ్య దేశాలలో మొదటి స్థానంలో నిలిచింది. సమాచార ప్రవాహాన్ని అడ్డుకోవడం ద్వారా వాస్తవాలను బయటకు రాకుండా చేసే ప్రయత్నంలో భాగమే ఇది. జర్నలిస్టులపై భౌతిక దాడులు, బెదిరింపులు మరియు ఆన్‌లైన్ వేధింపులు పెరిగాయని, ముఖ్యంగా రాజకీయంగా సున్నితమైన అంశాలపై వార్తలు రాసే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నివేదిక వివరించింది. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో వార్తలను సేకరిస్తున్న జర్నలిస్టులపై దాడులు జరగడం, ప్రాణహాని తలపెట్టడం వంటి ఘటనలు నిత్యకృత్యం. తాజాగా ఆంధ్రప్రదేశ్ లోనూ ఒక జర్నలిస్టును హత్యచేయడం తెలిసిందే. పత్రికా స్వేచ్ఛ అనేది కేవలం జర్నలిస్టుల హక్కు మాత్రమే కాదు, సమాచారం తెలుసుకోవాలనే పౌరుల ప్రాథమిక హక్కు. 'పత్రికా స్వేచ్ఛ కేవలం ప్రభుత్వం నుండి మాత్రమే కాదు, వాణిజ్య ప్రయోజనాల నుండి కూడా రక్షించబడాలి- అంటారు జవహర్ లాల్ నెహ్రూ. నేడు దేశంలోని ప్రధాన మీడియా సంస్థలు కొన్ని బడా కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లడంతో 'గోడీ మీడియా' సంస్కృతి పెరిగింది. ప్రకటనల కోసం ప్రభుత్వాల ప్రాపకం కోరడం వల్ల ప్రజల సమస్యల కంటే ప్రచారానికే పెద్దపీట వేయడం రివాజుగా మారింది. అందుకే అంటాడు మహాకవి శ్రీశ్రీ... 'పెట్టుబడికి, కట్టుకథకు పుట్టిన విషపుత్రికలు... ఈ ప్రతికలు- అని. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే, పత్రికలు తమ స్వతంత్రాన్ని కాపాడుకోవాలి. 'నిజాయితీ గల పత్రికలు దేశానికి వెన్నెముక వంటివి- అంటారు అంబేద్కర్. వెన్నెముక దెబ్బతింటే మనిషి ఎలా నిలబడలేడో, పత్రికా స్వేచ్ఛ లేని ప్రజాస్వామ్యం కూడా అలాగే నిలబడలేదు. పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవడం అనేది ప్రతి పౌరుడి బాధ్యత. రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను గౌరవించినప్పుడే భారత ప్రజాస్వామ్యం తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది.

## కంగ్రాచ్యులేషన్స్ విజయ్: మంత్రి నారా లోకేశ్




**అమరావతి, పతాకం న్యూస్:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం దిశగా దూసుకుపోతూ, రాజకీయ అరంగేట్రంలో సత్తా చాటిన నటుడు విజయ్‌కు ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. విజయ్ ఎన్నికల ప్రస్థానం అద్భుతంగా మొదలైందని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా లోకేశ్ స్పందిస్తూ, "తమిళనాడులో విజయ్ పార్టీ (టీవీకే) నమోదు చేస్తున్న అద్భుతమైన ఎన్నికల విజయాల పట్ల నా అభినందనలు. ఈ ఫలితాలు రాష్ట్ర ప్రజల మారుతున్న ఆకాంక్షలకు అద్దం పడుతున్నాయి. విజయ్ ఘనత తమిళనాడు రాజకీయ యవనికపై ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించింది" అని పేర్కొన్నారు. ప్రజా జీవితంలోకి అడుగుపెడుతున్న విజయ్‌కు శుభం కలగాలని లోకేశ్ ఆకాంక్షించారు. "ప్రజల అంచనాలను అందుకుంటూ, బాధ్యతతో, అంకితభావంతో విజయ్ పనిచేస్తారని ఆశిస్తున్నాను" అని లోకేశ్ తన సందేశంలో వివరించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు.

## 50 ఏళ్లలో తొలిసారి.. ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేకుండా వామపక్షాలు!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారత రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలుగొందిన వామపక్షాలు, ఇప్పుడు దేశంలో ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేని పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. గత ఐదు దశాబ్దాల్లో ఇలాంటి రాజకీయ శూన్యం ఏర్పడటం ఇదే తొలిసారి కానుంది. తమ చివరి కంచుకోట అయిన కేరళలోనూ లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) అధికారం కోల్పోయే సూచనలు స్పష్టంగా కనిపిస్తుండటంతో కమ్యూనిస్టు పార్టీల భవిష్యత్తుపై తీవ్ర చర్చ జరుగుతోంది. కేరళలో వెలువడుతున్న ఎన్నికల సరళి ప్రకారం పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం వెనుకంజలో ఉంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోతోంది. ఈ ఫలితాలు ఇలాగే కొనసాగితే, వామపక్షాలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేని చారిత్రక ఘట్టం ఆవిష్కృతమవుతుంది. ఈ నేపథ్యంలో తిరువనంతపురంలోని కాంగ్రెస్ కార్యకర్తలు ఇప్పటికే సంబరాలు ప్రారంభించారు. ఒకప్పుడు జాతీయ రాజకీయాల్లో వామపక్షాలది కీలక పాత్ర. 1996లో సీపీఎం అగ్రనేత జ్యోతి బసు యునైటెడ్ ఫ్రంట్ తరఫున ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చినా, పార్టీ పొలిట్‌బ్యూరో ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. దీనిని ఆయన తర్వాత 'చారిత్రక తప్పిదం'గా అభివర్ణించారు. 2008లో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతు ఉపసంహరించుకోవడంతో ప్రభుత్వం పార్లమెంటులో విశ్వాస పరీక్షను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ సమయంలో పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర.. ఇలా మూడు రాష్ట్రాల్లో లెఫ్ట్ పార్టీలు అధికారంలో ఉన్నాయి. భారత రాజకీయాల్లో కమ్యూనిస్టులది సుదీర్ఘ, ప్రభావవంతమైన చరిత్ర. 1957లో కేరళలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వంగా ప్రపంచ రికార్డు సృష్టించారు. ఇక, పశ్చిమ బెంగాల్‌లో 1977 నుంచి 2011 వరకు ఏకధాటిగా 34 ఏళ్లు పాలించి, దేశంలోనే సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న పార్టీగా చరిత్రకెక్కారు. జ్యోతి బసు ఒక్కరే 23 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అలాగే, త్రిపురలోనూ 1993 నుంచి మాణిక్ సర్కార్ నేతృత్వంలో వరుస విజయాలు సాధించి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. అయితే, గత దశాబ్ద కాలంగా వామపక్షాల ప్రాభవం క్రమంగా తగ్గుతూ వచ్చింది. సింగూర్, నందిగ్రామ్ భూసేకరణ ఉద్యమాల నేపథ్యంలో 2011లో పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ చేతిలో లెఫ్ట్ ఫ్రంట్ అధికారాన్ని కోల్పోయింది. ఆ తర్వాత 2018లో బీజేపీ ప్రభంజనంలో త్రిపుర కోట కూడా బద్దలైంది. దీంతో కేరళ ఒక్కటే వామపక్షాలకు చివరి ఆశగా మిగిలింది. 2021లో రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చి పినరయి విజయన్ సంచలనం సృష్టించారు. అయితే, తాజా ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా ఉండటంతో వామపక్షాల పాలన శకం తాత్కాలికంగా ముగింపు దశకు చేరుకున్నట్లేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఒమన్‌లో చిక్కుకున్న మహిళకు ఏపీ ప్రభుత్వం అండ



**అమరావతి, పతాకం న్యూస్:** ఒమన్‌లో చిక్కుకున్న అన్నమయ్య జిల్లా మహిళకు ఏపీ ప్రభుత్వం అండగా నిలిచింది. వయలపాడు గ్రామానికి చెందిన దూదేకుల షహ్నాజ్‌ను ఉద్యోగం పేరుతో నిర్బంధించిన ఏజెంట్ కార్యాలయం.. ఖర్చుల పేరుతో రూ.2 లక్షలు డిమాండ్ చేసింది. గతేడాది నవంబర్‌లో ఉద్యోగం కోసం షహ్నాజ్ మస్కట్ వెళ్లింది. అక్కడ ఉద్యోగం నచ్చక తిరిగి స్వదేశానికి రావాలని నిర్ణయించుకుంది. ఏజెంట్లు ఆమె ఫోన్ స్వాధీనం చేసుకుని, ఖర్చుల పేరుతో డబ్బులు డిమాండ్ చేయడంతో షహ్నాజ్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ విషయంపై ఏపీఎన్ఆర్టీ సొసైటీకి షహ్నాజ్ భర్త అబూబకర్ ఫిర్యాదు చేశారు. ఏపీ ప్రభుత్వం వెంటనే స్పందించి.. ఏపీఎన్ఆర్టీ సొసైటీ సహాయంతో ఒమన్‌లోని భారతీయ ఎంబసీకి లేఖ రాయించింది. పోలీసుల జోక్యంతో ఏజెంట్లతో చర్చలు జరుపగా.. ఖర్చులు భరించి షహ్నాజ్‌ను తిరిగి స్వదేశం పంపేందుకు ఏజెంట్లు అంగీకరించారు. మే 7వ తేదీన షహ్నాజ్ స్వదేశానికి చేరుకోనున్నట్లు సమాచారం. వలస కార్మికుల భద్రత, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. షహ్నాజ్ విషయంలో ఏపీఎన్ఆర్టీ సొసైటీ చొరవను సీఎం అభినందించారు.

## మహానాడును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తాం: మంత్రి నారాయణ



**నెల్లూరు, పతాకం న్యూస్:** తెలుగుదేశం పార్టీ ప్రతి ఏడాది నిర్వహించే మహానాడును ఈ సారి నెల్లూరు జిల్లాలో నిర్వహిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. మహానాడును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మహానాడును ఇఫ్కోసెజ్‌లో నిర్వహించాలని నిర్ణయించామని చెప్పుకొచ్చారు. అక్కడ రెండు వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్నామని.. ఈ నెల 6వ తేదీన పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రాష్ట్రం, ప్రజల భవిష్యత్తుకు సంబంధించి కీలక నిర్ణయాలను మహానాడులో తీసుకుంటామని.. ప్రజలకు పలు హామీలు ఇస్తామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది మహానాడుకు రానున్నారని చెప్పుకొచ్చారు. ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## ప్రియుడు ఆత్మహత్య.. ప్రియురాలు కూడా మృతి




**జగిత్యాల, పతాకం న్యూస్:** నిశ్చితార్థమయ్యింది... గల్ఫ్ లో ఉన్న ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నాడన్న వార్త విని ప్రియురాలు కూడా మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన జగిత్యాల జిల్లాలో జరిగింది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని రెండు గ్రామాల్లో విషాదం నెలకొంది. బాధిత కుటుంబీకులు, పోలీసుల వివరాల మేరకు ... పాతదాంరాజుపల్లికి చెందిన మక్కల సాయికుమార్ (22), సిరిపూర్ గ్రామానికి చెందిన ఒల్లె శ్రుతి (20) ప్రేమించుకున్నారు. పెద్దలు కూడా వారి వివాహానికి అంగీకరించి ఏడు నెలల కిందట నిశ్చితార్థం చేశారు. సాయికుమార్ తన కుటుంబానికి రేకులషెడ్డు మాత్రమే ఉందని, ఇల్లు కట్టుకున్నాకే పెళ్లి చేసుకుంటానని చెప్పి బహ్రెయిన్ వెళ్లాడు. అక్కడ కూలి పనులు చేసుకుంటున్న క్రమంలో ఆర్థిక ఇబ్బందులు, పని ఒత్తిడి తట్టుకోలేక న ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. విషయం తెలిసిన శ్రుతి తీవ్ర మనస్తాపానికి గురైంది. అందరూ నిద్రించిన తర్వాత ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని తానూ బలవన్మరణానికి పాల్పడింది. దీంతో రెండు గ్రామాల్లో విషాదం చోటుచేసుకుంది.

## సంత్ త్యాగరాజ 259వ జయంతి.. పవన్ నివాళులు



**అమరావతి, పతాకం న్యూస్:** సంత్ త్యాగరాజ 259వ జయంతి పవిత్రోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాళులర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. దేశ సాంస్కృతిక ఆత్మను సుసంపన్నం చేసి భారతదేశపు గొప్ప సంగీత స్వరకర్త – సాధువులలో ఒకరైన త్యాగరాజకు ఉపముఖ్యమంత్రి వినయపూర్వక నివాళులు అర్పించారు. త్యాగరాజ జన్మస్థలమైన ఆంధ్రప్రదేశ్‌లో ఆయన వారసత్వాన్ని అంతే భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం మన సాంస్కృతిక బాధ్యతని పవన్ వెల్లడించారు. 'సంత్ త్యాగరాజ 259వ జయంతి పవిత్రోత్సవం సందర్భంగా భక్తిని శాశ్వత ఆధ్యాత్మిక మార్గంగా మలిచి, భారత సాంస్కృతిక ఆత్మను సుసంపన్నం చేసిన భారతదేశపు గొప్ప సంగీత స్వరకర్త–సాధువులలో ఒకరైన వారికి నా వినయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. శ్రీరాముని భక్తిలో లీనమై, ఆయన తన జీవితమంతా తత్వశాస్త్రం, భావోద్వేగం, దైవానుభూతిని ఏకం చేసే సంగీతాన్ని స్వరపరచడానికి అంకితం చేశారు. సంగీత సంప్రదాయం త్యాగరాజను దాదాపు 24,000 కీర్తనల రచయితగా గౌరవిస్తుంది. అయినప్పటికీ, నేడు కేవలం 730 రచనలే మిగిలి ఉన్నాయి. వాటిలో 400 మాత్రమే ప్రదర్శనల రూపంలో కొనసాగుతున్నాయి. ఈ అమూల్యమైన సంగీత వారసత్వాన్ని భవిష్యత్తుతరాలకు తక్షణమే పరిరక్షించి, అందించాల్సిన మనందరి సమష్టి కర్తవ్యానికి ఈ వాస్తవం ఒక గంభీరమైన జ్ఞాపిక. త్యాగరాజ జన్మస్థలమైన ఆంధ్రప్రదేశ్‌లో ఆయన వారసత్వాన్ని అంతే భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం మన సాంస్కృతిక బాధ్యత అవుతుంది. సాంస్కృతిక శాఖ సమన్వయంతో సంత్ త్యాగరాజ రచనలకు సంబంధించిన రాతప్రతులు, స్వరలిపి, అరుదైన రికార్డింగ్‌లు, మౌఖిక సంప్రదాయాలు, ఆర్కైవల్ సామగ్రిని డిజిటలైజ్ చేస్తాం' అని ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

## కేరళం సీఎం రేసులో కేసీ వేణుగోపాల్ సహా ముగ్గురు

**కేరళ, పతాకం న్యూస్:** పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కేరళం (ఖవత్థుశ్రీఘఏ)లో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికార పగ్గాలు చేపట్టనుండటం ఖాయమైంది. కాంగ్రెస్ సారథ్యంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఖణఖీ) ప్రభుత్వం కేరళంలోని 140 స్థానాల్లో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ మార్క్‌ను దాటడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కాగా, ముఖ్యమంత్రి రేసులో ముగ్గురు కాంగ్రెస్ నేతలు పోటీలో ఉన్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, అసెంబ్లీలో విపక్ష నేత వీడీ సతీశన్, పార్టీ కేరళం విభాగం మాజీ అధ్యక్షుడు రమేష్ చెన్నితాల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. రమేష్ చెన్నితాల సీనియర్ మాత్రమే కాకుండా కేసీ వేణుగోపాల్, సతీశన్ కంటే కూడా ఎక్కువ రాజకీయ అనుభవం కలిగి ఉన్నారు.

# సమస్యల వలయంలో రాజేంద్రపాలెం పీహెచ్‌సీ..



**కొయ్యూరు, పతాకం న్యూస్:** మండలంలో అతి పెద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యలతో సతమతమ వుతోంది. నిత్యం రోగులతో రద్దీగా ఉండే రాజేంద్రపాలెం పీహెచ్‌సీని వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. అంతేకాదు పీహెచ్‌సీలో రోగులకు తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. మండలంలో ఉన్న నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రాజేంద్రపాలెం పీహెచ్‌సీ పరిధి చాలా పెద్దది. ఈ పీహెచ్‌సీ పరిధిలో 15 సచివాలయాలు, 8 సబ్ సెంటర్లు ఉన్నాయి. ఈ పీహెచ్‌సీలో గడిచిన 20 రోజులుగా ఒక్కరే డాక్టరు విధులు నిర్వహిస్తున్నారు. మూడు నెలల క్రితమే ఇద్దరు వైద్యులను నియమించారు. వారిలో ఒకరైన స్నేహలత రెడ్డి 20 రోజుల క్రితం ఉద్యోగానికి రాజీనామా చేయడంతో ఒక్క వైద్యుడే ఉన్నారు. రోజుకు ఈ పీహెచ్‌సీకి సుమారు 150 మంది రోగులు వస్తుంటారు. వీరందరికీ ఒక్క వైద్యుడే సేవలందించడం కష్టంగా ఉంది. దీంతో చాలా మంది రోగులు పీహెచ్‌సీకి రాకుండా ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పీహెచ్‌సీ పరిధిలోని మూడు సబ్‌సెంటర్లకు ఏఎన్‌ఎంలు లేరు. ప్రస్తుతం సచివాలయ ఏఎన్‌ఎంలతో కాలక్షేపం చేస్తున్నారు. ప్రస్తుతం వ్యాధుల సీజన్ కావడంతో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించకపోవడంతో రోగులకు వైద్య సేవలు అందడం లేదు. ఇక్కడ పనిచేసే స్టాఫ్‌నర్సుకు డిప్యూటేషన్ వేయడంతో పీహెచ్‌సీలో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ముఖ్యంగా అత్యవసర పనిపై ఒక్కగానొక్క వైద్యుడు సెలవు పెడితే ఆ రోజు రోగులకు అవస్థలు తప్పడం లేదు. ఇక పీహెచ్‌సీలో ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ నెల రోజుల క్రితమే పాడై మూలకు చేరింది. దీని మరమ్మతులు చేయించేందుకు కాంట్రాక్టరుకు సిబ్బంది సమాచారమందించారు. కాంట్రాక్టు కాల వ్యవధి పూర్తయినందున ఆ కాంట్రాక్టర్ స్పందించలేదు. దీంతో మండు వేసవిలో తాగునీరు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇక వైద్య పరీక్షలకు నిర్మించిన ల్యాబ్ భవనం సిద్ధంగా ఉన్నా అవసరమైన మెటీరియల్ సరఫరా కాక ఆరు నెలలుగా వృథాగా ఉంది. రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది, సౌకర్యాల కల్పనకు కలెక్టర్, డీఎంహెచ్‌వోలు చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలు కోరుతున్నారు.

## జోరుగా రైల్వే జోన్ పనులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ముడసర్లోవలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయ భవన నిర్మాణం పనులు చకచకా జరుగుతున్నాయి. 2027 చివరికి దీనిని పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. తొలుత రూ.172 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించగా, ఆ తరువాత దీనిని రూ.183.58 కోట్లతో లోక్‌సభకు సమర్పించారు. రైల్వేకు జీవీఎంసీ 52.2 ఎకరాల భూమి అప్పగించగా, గత ఏడాది జనవరి 8న భవన నిర్మాణ పనులకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ఈ భూమిలో బేస్‌మెంట్ 1+బేస్‌మెంట్ 2 +గ్రౌండ్+తొమ్మిది అంతస్థుల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించి, దాని ప్రకారమే పనులు చేస్తున్నారు. బిల్టప్ ఏరియా 27,548.30 చ.మీ. కాగా మొత్తం ఫ్లోర్ ఏరియా 36,128.50 చ.మీ. బేస్‌మెంట్లు, ఓపెన్ ఏరియాతో కలుపుకొని 290 కార్లు, 615 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకునే సౌకర్యం ఉంటుంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో లాబీ, ఆడిటోరియం, గ్రీన్ రూమ్స్, సెక్యూరిటీ, బ్యాక్ ఆఫీస్ ఉంటాయి. మొదటి అంతస్థు నుంచి తొమ్మిదో అంతస్థు వరకు వివిధ విభాగాల వారీగా కార్యాలయాలు వస్తాయి. మొదటి అంతస్థులో కమర్షియల్ విభాగం, జోనల్ ఆఫీస్, సీపీఆర్ఓ కార్యాలయం ఉంటాయి. ప్రతి అంతస్థులో 2,702.83 చ.మీ. విస్తీర్ణం వచ్చేలా నిర్మాణాలు చేస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో సర్వీస్ ఏరియా 851 చ.మీ., మిగిలిన అంతస్థుల్లో 525 చ.మీ. కేటాయించారు. వర్షపు నీటిని సంరక్షించడానికి 25 ప్రాంతాల్లో రీచార్జింగ్ పాయింట్లు పెడుతున్నారు. మొత్తం నాలుగు లిఫ్టులు ఉంటాయి. ఒక్కొక్కటి 20 మందిని తీసుకువెళ్లే సామర్థ్యం ఉంటుంది. ప్రస్తుతం ముడసర్లోవలో జరుగుతున్న పనులను చీఫ్ ఇంజనీర్ పర్యవేక్షిస్తున్నారు.

## స్పా ముసుగులో వ్యభిచారం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం జరుగుతుండడంతో పోలీసులు దాడిచేసి నలుగురు మహిళలు, ఇద్దరు విటులతో సహా నిర్వాహకులను అరెస్టు చేశారు. ద్వారకనగర్ రెండో లైన్ జీవీకే టవర్స్ రెండో అంతస్తులో బెల్ల థాయ్ స్పా, ఫుట్ రిలీఫ్ సెంటర్‌ను దాసరి కొండయ్య, వడ్డె స్వప్న అనే ఇద్దరు నిర్వహిస్తున్నారు. ఈ సెంటర్‌కు మేనేజర్‌గా గాంధీ సాయికుమార్, రిసెప్షనిస్ట్‌గా మేడిశెట్టి రేవతి పనిచేస్తున్నారు. స్పా పేరుతో మగవారికి ఆడవారితో మసాజ్ చేయించడంతో పాటు వ్యభిచారం నిర్వహిస్తున్నారు. దీనిపై అందిన సమాచారం మేరకు ద్వారకా సీఐ వెంకటరమణ, టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి ఆదివారం దాడి చేశారు. పోలీసులు దాడి చేసిన సందర్భంలో కుమార్ ప్రభు, తొంగ దేముడునాయుడు మసాజ్ చేయించుకుంటూ పట్టుబడ్డారు. వారికి ఇద్దరు మహిళలు అర్ధనగ్నంగా మసాజ్ చేస్తున్నట్టు గుర్తించారు. స్పా సెంటర్‌లో పనిచేస్తున్న నలుగురు మహిళలను, వారి నుంచి 6 మొబైల్ ఫోన్లు, ఒక డీవీఆర్, లెనోవా ట్యాబ్, రూ.14,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు స్పా నిర్వాహకుల సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ మహిళలను శక్తి సదన్ హోమ్‌కు తరలించారు. స్పా సెంటర్ నిర్వాహకులు, ఇద్దరు మసాజ్ చేయించుకున్న పురుషులపై సీఐ వెంకట రమణ కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు.

## విశాఖ జిల్లాలో మరో రెండు కోర్టులు ప్రారంభం



**గాజువాక, భీమిలి, పతాకం న్యూస్:** జిల్లాలో రెండు కోర్టులను హైకోర్టు న్యాయమూర్తులు ప్రారంభించారు. వీటి ద్వారా కక్షిదారులకు న్యాయ సేవలు మరింత చేరువకానున్నాయన్నారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో నిర్మించిన ఫ్యామిలీ కోర్టును హైకోర్టు జడ్జి జస్టిస్ రవినాథ్ తిల్హారి ప్రారంభించారు. దీనిద్వారా కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యే ఉంటుందన్నారు. భీమిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి కోర్టును జస్టిస్ రవినాథ్ తిల్హారి ప్రారంభించారు. ప్రథమ సీనియర్ సివిల్ జడ్జిగా డి.సోని బాధ్యతలు స్వీకరించారు. అతిథులను భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.జనార్దనరావు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్నారు. కోర్టు మంజూరు కావడానికి సహకరించిన హైకోర్టు జడ్జి జస్టిస్ రవి చీమలపాటికి కృతజ్ఞతలు తెలిపారు. భీమిలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ డి.సౌజన్య కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమాల్లో హైకోర్టు జడ్జి జస్టిస్ రవి చీమలపాటి, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి చిన్నంశెట్టి రాజు, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి వెంకటరమణ, గాజువాక ఎనిమిదో డిస్ట్రిక్ జడ్జి ఎస్.కవిత, ఎనిమిదో అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెసన్స్ జడ్జి జి.షణ్ముఖరావు, మూడో అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వి.పల్లవి, జడ్జిలు ఎంవీ.శేషమ్మ, వై.శ్రీలక్ష్మి, ఎ.రమేష్, న్యాయవాదులు ఎంఎస్ గౌతమ్, పి.వెంకటేశ్వరరావు, అండిబోయిన లక్ష్మి, నాగదేవి, ఆదిలక్ష్మి, సీతామహాలక్ష్మి, మల్లిక వెంకటలక్ష్మి, శ్యామ్, లక్ష్మణ్, విశాఖ నార్త్ ఏసీపీ అప్పలరాజు, భీమిలి తహశీల్దార్ పైల రామారావు పాల్గొన్నారు.

## శ్లాబు ఎత్తు పెంచేందుకు యజమాని యత్నం.. కూలి మృతి



**పెదగంట్యాడ, పతాకం న్యూస్:** రోడ్డు విస్తరణలో భాగంగా డ్రైనేజీ ఎత్తు పెరగడంతో తన షాపులోకి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతుండడంతో దానిని ఎత్తు పెంచేందుకు యజమాని చేసిన ప్రయత్నం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. శ్లాబ్‌ను ఎత్తు చేసేందుకు కూలీలు జాకీలతో పనులు ప్రారంభించగా ఒక్కసారిగా కుప్పకూలి ఓ కార్మికుడు శిథిలాల కింద చిక్కుకుని మృతిచెందాడు. మరో ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో జరిగింది. పెదగంట్యాడ మండలం వికాస్‌నగర్‌కు చెందిన నవీన్‌కుమార్‌కు మెయిన్ రోడ్డు పక్కన ఓ షాపు ఉంది. ఇటీవల జీవీఎంసీ మెయిన్ రోడ్డు ఆధునికీకరణ పనులను చేపట్టింది. ఇందులో భాగంగా షాపు ముందు డ్రైనేజీ ఎత్తు పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో షాపులో నిర్వహిస్తున్న ఫొటో స్టూడియోను మరో ప్రాంతానికి మార్చారు. శ్లాబ్ ఎత్తు పెంచి, దానికి అనుగుణంగా గోడలు పెంచాలన్న ఉద్దేశంతో షాపు యజమాని గాజువాక మార్కెట్‌కు చెందిన ఆరుగురు కూలీలను నియమించుకున్నారు. వీరంతా పనులకు వచ్చి 13 అడుగుల పొడవు 12 అడుగుల వెడల్పుకలిగిన శ్లాబును 12 జాకీలతో పైకి ఎత్తే ప్రయత్నంచేశారు. కాగా షాపు అప్పటికే శిథిలావస్థలో ఉండడంతో విరిగిపోయి కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో కార్మికుడు తిమ్మల నాగేశ్వరరావు (38) శిథిలాల కింద నలిగి మృతి చెందాడు. ప్రసాదరావు, గొర్ల నారాయణరావు, సత్యనారాయణ స్వల్పగాయాలతో బయటపడ్డారు. శ్లాబునకు బయట నుంచి జాకీలు వేస్తున్న రాజు, నారాయణరావు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. సమాచారం మేరకు న్యూపోర్టు సీఐ టి.కామేశ్వరరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని కేజీహెచ్‌కు తరలించారు. పెదగంట్యాడ అగ్నిమాపక విపత్తుల నిర్వహణ శాఖ సిబ్బంది కూడా చేరుకుని, నాగేశ్వరరావు మృతదేహాన్ని వెలికి తీసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. జాకీలను ఉపయోగించి శిథిలాలను ఎత్తేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీంతో గంగవరం పోర్టు నుంచి భారీ క్రేన్‌ను రప్పించి, రాత్రి 8.30 సమయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. షాపు యజమాని నవీన్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అనకాపల్లి నుంచి మరో రెండో కొత్త రైళ్లు




**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి నుంచి తిరుపతి, మహారాష్ట్రలోని సోలాపూర్‌కు వారం రోజుల్లో ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి వస్తాయని అనకాపల్లి ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ అయిన సీఎం రమేశ్ ప్రకటించారు. అనకాపల్లి నుంచి తెలంగాణలోని చర్లపల్లి (సికింద్రాబాద్ శివారు) మధ్య ప్రవేశపెట్టిన వారాంతపు ప్రత్యేక రైలును (నంబరు 17046) ఆయన సాయంత్రం ఒకటో నంబరు ప్లాట్‌ఫారం నుంచి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎంపీ రమేశ్ మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతికి నిత్యం వందలాది మంది వెళ్తుంటారని, రైల్వే స్టాండింగ్ బోర్డు ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ నెల 8వ తేదీ నుంచి వీక్లీ సర్వీసును అందుబాటులోకి వచ్చేలా కృషి చేసినట్టు చెప్పారు. అనకాపల్లి జిల్లాలో కొత్తగా పలు పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్‌తోపాటు కర్ణాటకలోని కలబుర్గి, మహారాష్ట్రలోని సోలాపూర్, చుట్టుపక్కల ప్రాంతాలకు రాకపోకల సాగించే వారికోసం అనకాపల్లి-సోలాపూర్ వీక్లీ ప్రత్యేక రైలు కూడా వారి రోజుల్లో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో వున్న లక్ష్మీదేవిపేట ఫ్లైఓవర్ వంతెన పనులను త్వరలో పునరుద్ధరించేలా చర్యలు చేపట్టినట్టు ఆయన చెప్పారు. అంతకుముందు ఎంపీ, ఎమ్మెల్యే, తదితరులు ప్లాట్‌ఫారంపై ఉన్న అనకాపల్లి-చర్లపల్లి రైలు బోగీల్లోకి వెళ్లి పలువురు ప్రయాణికులు మాట్లాడారు. హైదరాబాద్ వెళ్లిరావడానికి ఈ రైలు ఎంతో సౌకర్యవంతంగా వుంటుందని పలువురు ప్రయాణికులు చెప్పారు. ఈ రైలులో సెకండ్ ఏసీ బోగీలు మూడు, థర్డ్ ఏసీ బోగీలు ఐదు, స్లీపర్ క్లాస్ బోగీలు 10, మహిళలు, దివ్యాంగులకు రెండు బోగీలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయకృష్ణన్, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఆర్డీవో షేక్ ఆయీషా, స్టేషన్ మేనేజర్ సచ్చి నివాస్, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి: కలెక్టర్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కేజీహెచ్‌కు ఎంతో విశిష్టత, ప్రాముఖ్యం ఉన్నాయని, అందుకు అనుగుణంగా రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. ఆస్పత్రిని సందర్శించిన ఆయన వార్డుల్లో రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఓపీ, క్యాజువాల్టీ, ఎమర్జన్సీ వార్డు, సీఎస్ఆర్ బ్లాక్‌లోని ల్యాబ్‌లను సందర్శించారు. అక్కడి పరిస్థితుల గురించి వైద్యులు, సిబ్బంది, రోగులతో మాట్లాడారు. అనంతరం సూపరింటెండెంట్ కార్యాలయానికి వెళ్లి వైద్యులతో సమావేశమయ్యారు. అందిస్తున్న సేవలు, అక్కడున్న సమస్యలను విభాగాధిపతులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వార్డుల సామర్థ్యం, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఆధునిక పరికరాల వినియోగం, ఇతర అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా విభాగాధిపతులు పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా వాటిపై సానుకూలంగా స్పందించారు. జిల్లా స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలపై త్వరలో చర్చిద్దామని, రాష్ట్రస్థాయిలో అంశాలను ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చించి తదుపరి కార్యాచరణ రూపొందిద్దామని పేర్కొన్నారు. కేజీహెచ్‌కు ఎంతో పేరు ఉందని, దానికి తగినట్టుగా వైద్యులు వ్యవహరించాలన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా కృషి చేయాలన్నారు. ఓపీ వద్ద ఆస్పత్రి స్టాంపు, లోగో ఏర్పాటుచేయాలని సూచించారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖరం నాయుడు, చీఫ్ డైటీషియన్ రమణమూర్తి, ఆర్ఎంవోలు డాక్టర్ బంగారయ్య, డాక్టర్ శిల్ప, ఇతర అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

## విజయ్ గెలుపును ముందే చెప్పిన ప్రశాంత్ కిషోర్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** తమిళనాడులో విజయ్ టీవీకే 98 నుంచి 120 సీట్లు గెలుస్తుందని గత ఏడాది మార్చిలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ముందే జోస్యం చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దళపతి విజయ్ తాజాగా సునామీ సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన గెలుపు ఖాయమని ఏడాది క్రితమే ప్రశాంత్ కిషోర్ చెప్పిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. 'ఈ వీడియో దాచి పెట్టుకోండి. ఫలితాల తరువాత ప్లే చేయండి' అని ఆ వీడియోలో ప్రశాంత్ కిషోర్ సవాలు విసిరారు. ప్రశాంత్ కిషోర్ గత ఏడాది మార్చిలో తంతి టీవీకి ఇంటర్వ్యూ ఇచ్చారు. టీవీకే ఆవిర్భావం జరిగి అప్పటికి ఏడాది అయింది. తమిళ సూపర్‌స్టార్, టీవీకే వ్యవస్థాపకుడు విజయ్ విజయావకాశాలపై అడిగిన ప్రశ్నకు ప్రశాంత్ కిషోర్ సూటిగా సమాధానమిచ్చారు. విజయ్ ఒంటరిగా ఎన్నికల బరిలోకి వెళ్లాలని పట్టుదలగా ఉన్నారని, అందులో మార్పు ఉంటుందని తాను అనుకోనని చెప్పారు. ఒంటిరిగా ఎన్నికల్లోకి వెళ్తే తమిళనాడులో ఆయన విజయం సాధిస్తారని అన్నారు. విజయానికి అవసరమైన 118 సీట్ల కంటే ఎక్కువే సాధిస్తారని పేర్కొన్నారు. 'ఈ వీడియాను దాచిపెట్టుకోండి... ఫలితాల తరువాత ప్లే చేయండి' అని కూడా ఆయన ఢంకా బజాయించారు. ప్రశాంత్ కిషోర్ 'ఐ-ప్యాక్' పొలిటికల్ స్ట్రాటజీ సంస్థ తమిళనాడులో టీవీకేతో కలిసి పనిచేసిందనే వార్తలు కూడా వచ్చాయి. విజయ్‌తో ఉన్న అసోసియేషన్‌ను ఆ ఇంటర్వ్యూలో ప్రశ్నించినప్పుడు, తాము రాజకీయ సహచరుల కంటే మంచి మిత్రులమని అన్నారు.

## అనారోగ్యంతో సీఆర్పీఎఫ్ జవాన్ మృతి

**అనకాపల్లి, పతాకం న్యూస్:** మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ గొల్ల షణ్ముఖరావు(29) మృతిచెందారు. విశాఖపట్నం 198 బెటాలియన్‌కు చెందిన ఈయన అనారోగ్యంతో మృతిచెందగా.. స్థానిక సీఐ కృష్ణారావు సిబ్బంది సారథ్యంలో ఆయన మృతదేహా న్ని స్వస్థలం బొద్దాంకు తీసుకువచ్చారు. ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. షణ్ముఖరావు నాలుగేళ్ల కిందటే ఉద్యోగంలో చేరారు.

## మోడీ నాయకత్వంపై ప్రజల విశ్వాసానికి ఈ ఫలితాలే నిదర్శనం: మాధవ్

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజల విశ్వాసానికి ఈ ఎన్నికల ఫలితాలే స్పష్టమైన నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'వికసిత్ భారత్' లక్ష్యంతో దేశం ముందుకు సాగాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, నితిన్ నబిన్ నాయకత్వంపై ప్రజలకు గట్టి నమ్మకం ఉందని వెల్లడించారు. బీజేపీ విజయానికి కృషి చేసిన ప్రతీ నాయకుడు, కార్యకర్తకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.కేరళం రాష్ట్రాల్లో కూడా బీజేపీ ఓటు శాతంలో గణనీయమైన పెరుగుదల నమోదు అయ్యిందన్నారు. అభివృద్ధి, జాతీయ భద్రత, పారదర్శక పాలనకు ప్రజలు పూర్తి మద్దతు ఇచ్చారన్నారు. కేంద్ర సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, డిజిటల్ పురోగతికి దేశవ్యాప్తంగా ప్రశంసలు వచ్చాయన్నారు.

## గిరిజనులకు తప్పని నీటి కష్టాలు



**రావికమతం, పతాకం న్యూస్:** వేసవిలో ఆదివాసీ గిరిజనులకు కష్టాలు తప్పడం లేదు. మంచినీటి కోసం వారి ఇక్కట్లను ఎవరూ పట్టించుకోవడం లేదు. రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ జెడ్ జోగంపేట గ్రామంలో ఎస్టీ కొండదొర తెగకు చెందిన 64 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆ గ్రామంలో వాటర్ ట్యాంక్ ఉంది. అయితే రెండ్రోజులుగా ఇక్కడ విద్యుత్ సరఫరా లేదు. కల్యాణలోవ రిజర్వాయర్ వరకు అక్కడి నుంచి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలొస్తే తమ గ్రామాలకు గెడ్డ నీరే గతి అని వాపోతున్నారు. తాగునీటికి ప్రత్యామ్నాయంగా కనీసం బోరు బావి కూడా అందుబాట్లో లేదంటున్నారు. ఉన్న రెండు బోర్లూ పని చేయడం లేదు. వర్షాలొచ్చే ప్రతిసారీ అంతేనని, విద్యుత్ సరఫరా కట్ అయిపోతే నీరుండడం లేదని ఆ కుటుంబాలన్నీ మొత్తుకుంటున్నాయి. పెద్దగెడ్డలో నీళ్లు తెచ్చుకుని సరిపెట్టుకుంటున్నామని, మంచినీళ్ల కోసం పనులు మానుకొని గెడ్డకి వెళ్లి నీరు తెచ్చుకునే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు చొరవ చూపించి ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేయాలని ఆదివారం గ్రామస్తులు వినూత్న రీతిలో ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలో కొండపల్లి నూకరత్నం. చీడిపెల్లి గోవిందమ్మ బిడ్డ జర్నీ తులసి మహిళలు పాల్గొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కరెంట్ సమస్య పరిష్కారం చేసి ప్రత్యామ్నాయంగా బోరు ఏర్పాటు చేసి నీరు ఇవ్వాలని సిపిఎం నాయకులు పాంగి చంద్రయ్య సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు డిమాండ్ చేయడం జరిగింది.

## సీఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా



**కోటబొమ్మాళి, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభు త్వం ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్)తో పేదల ఆరోగ్యానికి పూర్తి భరోసా కల్పిస్తుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం టెక్కలి నియోజకవర్గానికి చెందిన 8 మంది లబ్ధి దారులకు రూ.5లక్షల చెక్కులను అందజేశారు. ఇప్పటివరకు నియోజకవర్గం పరిధిలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.3.28 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజ రాపు హరివరప్రసాద్, నాయకులు తర్ర రామకృష్ణ పాల్గొన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి కిం జరాపు అచ్చెన్నాయుడుకు కోటబొ మ్మళి మండలానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా స న్మానించారు. ఈ సందర్భంగా మంత్రి చేసిన పలు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కాళింగకోమటి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరా జులు, జిల్లా రైస్‌మిల్లుల సంఘం అధ్యక్షుడు బో యిన రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు బోయిన సత్యశ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు వెలమల విజ యలక్ష్మి కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న అంబులెన్స్.. నలుగురు మృతి




**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుపతి జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిపై శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద ఆగి ఉన్న లారీని అంబులెన్స్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కతా నుంచి ఒక రోగిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరులోని ఓ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జాతీయ రహదారిపై అప్పటికే నిలిపి ఉంచిన లారీని అంబులెన్స్ వెనుక నుంచి వచ్చి బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి అంబులెన్స్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న రోగితో పాటు ఆయనకు సహాయకులుగా ఉన్న మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారని ప్రాథమిక సమాచారం. వీరి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. అంబులెన్స్ డ్రైవర్ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించి డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న శ్రీకాళహస్తి పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించారు.

# ఏపీలో మళ్లీ 'నక్ష' సర్వే.. ఇక ప్రతి ఇంటికి ప్రత్యేక ప్రాపర్టీ కార్డు



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీలోని నగరాలు, పట్టణాల్లో నివసించే ప్రజల ఆస్తులకు పటిష్ఠమైన భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి కుటుంబానికి చెందిన ఇళ్లు, స్థలాలు, ఇతర ఆస్తుల వివరాలతో కూడిన 'ప్రాపర్టీ కార్డు'లను జారీ చేయాలని నిశ్చయించింది. ఇందుకోసం గతంలో మధ్యలోనే నిలిచిపోయిన 'నక్ష' (నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్) ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించనుంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ సర్వేను పునఃప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామాల్లో 'స్వామిత్వ' పథకం తరహాలోనే పట్టణ ప్రాంతాల్లోనూ ప్రజల ఆస్తులను ఆధునిక డ్రోన్లు, జీఐఎస్ టెక్నాలజీ ఉపయోగించి సర్వే చేయాలని కేంద్రం 2024లో 'నక్ష' ప్రాజెక్టును ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 152 నగరాలు, పట్టణాలను ఎంపిక చేయగా, అందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాకినాడ, ఏలూరు, గుంటూరు, మంగళగిరి-తాడేపల్లి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కుప్పం, అనంతపురం వంటి తొమ్మిది నగరాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ నగరాల్లో సర్వే ప్రక్రియ కొంతవరకు జరిగినా, రికార్డుల నమోదు, మ్యాపింగ్ వంటి కీలక పనులు పూర్తికాలేదు. దీంతో వాస్తవ గడువు ముగిసినప్పటికీ, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిచేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది. 2027 మార్చి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రతి ఆస్తి యజమానికి ఒక ప్రాపర్టీ కార్డు లభిస్తుంది. ఈ కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆస్తికి సంబంధించిన పూర్తి వివరాలు (విస్తీర్ణం, హద్దులు, యజమాని వివరాలు) సులభంగా తెలుసుకోవచ్చు. దీనివల్ల ఆస్తుల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ వంటి ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగంగా పూర్తవుతాయి. అంతేకాకుండా, ఈ కార్డులను ప్రామాణికంగా చూపి బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు పొందే అవకాశం ఉంటుంది. మరోవైపు, మున్సిపల్ అధికారులకు తమ పరిధిలోని ఆస్తులపై స్పష్టమైన సమాచారం ఉండటంతో నగర ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన మరింత సులభతరం అవుతుంది. త్వరలోనే ఈ సర్వే పునఃప్రారంభంపై ప్రభుత్వం నుంచి అధికారికంగా స్పష్టత రానుంది.

## టెన్త్ ఫలితాలపై కలెక్టర్ నిషాంతి తీవ్ర అసంతృప్తి



**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి ఫలితాలు ఎందుకు ఇలా వచ్చాయని జిల్లా కలెక్టర్ టి.నిషాంతి విద్యాశాఖాధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. జిల్లాలో టెన్త్ ఫలితాలు నిరాశపరచడంతో విద్యాశాఖాధికారులతో ఆమె ప్రత్యేకంగా సమాశమై ఫలితాలు దిగజారడంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... టెన్త్ విద్యార్థుల కోసం వంద రోజుల విద్యాప్రణాళిక అమలు చేస్తే? చక్కని ఫలితాలు ఎందుకు రాలేదన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సదుపాయాలు, వసతులు కల్పిస్తున్నప్పటికీ.. ఎందుకు ఆశించిన ఫలితాలు రాలేదని ప్రశ్నించారు. ఈఏడాది ఫలితాలు బాగాలేని పాఠశాలల్లో పరిస్థితులను గుర్తించి, వచ్చే ఏడాది చక్కని ఫలితాలు సాధించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికబద్ధంగా సిలబస్ పూర్తి చేయడం, వెనుకబడి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచడం, శత శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయడం మఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో టెన్త్ ఎంతో ముఖ్యమని, అక్కడే విఫలం కావడం సరికాదని, ఇకపై అటువంటి పరిస్థితులు పునరావృతమైతే అందుకు బాధ్యులైన విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ నిషాంతి హెచ్చరించారు. మెరుగైన విద్యాబోధన కొనసాగించాలని, వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని విద్యార్థిలో పఠనాసక్తిని పెంచాలన్నారు. పాఠశాల ప్రధానోధ్యాయులు ముందుస్తుగానే యాక్షన్ ప్లాన్‌ను రూపొందించుకుని అమలు చేయాలని, అధికారులు విధిగా నిత్యం పర్యవేక్షించి, ప్రతివారం విద్యపై సమీక్షా సమావేశాలు నిర్వహించాలన్నారు. టెన్త్ తప్పిన విద్యార్థులు సప్లిమెంటరీలోనైనా పాస్ అయ్యేలా బోధన సాగించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు చేపట్టేందుకు వెనుకాడనని జిల్లా కలెక్టర్ టి.నిషాంతి స్పష్టం చేశారు. ఈ సమావేశాల్లో జిల్లా విద్యాశాఖాధికారి రామకృష్ణారావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీబీకే.పరిమిళ, గిరిజన గురుకులాల కన్వీనర్ పీఎస్ఎన్.మూర్తి, డిప్యూటీ డీఈవో చెల్లయ్య, జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు, ఏటీడబ్ల్యూవోలు, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

## అన్నిరంగాల్లో బీసీలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి



**అరసవల్లి, పతాకం న్యూస్:** దేశ జనాభాలో బీసీలు సుమారు 65 శాతం ఉన్నారని, కానీ ఆర్థిక, సామాజిక, విద్య, వైద్య, రాజకీయ రంగాల్లో ఇంకా వెనుకబడే ఉన్నారని, వారికి అన్ని రంగాల్లో సమాన ప్రాతినిధ్యం కల్పించాలని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నరసింగరావు డిమాండ్ చేశారు. ఎన్జీవో హోంలో సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు వృత్తి పరమైన నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. బీసీ హాస్టళ్లు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల సంఖ్యను పెంచాలన్నారు. సంఘం నాయకుడు కిల్లాన శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలు దేశానికి వెన్నెముక అని, అయినా ఇంకా వెనుకబడే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు న్యాయమైన హక్కులను సాధించుకోవాలని, గళాన్ని బలంగా వినిపించాలన్నారు. రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చౌదరి పురుషోత్తం నాయుడు మాట్లా డుతూ.. బీసీ సంఘాలన్నీ ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాటంచేయాల న్నారు. ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, బొట్టా మధు, ఈవీ సత్యనారాయణ, రాయి వేణుగోపాల్, జి. కృష్ణారావు, రౌతు శంకరరావు, డాక్టర్ పైడి సింధూర, సురేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కొడుకు సాయంతో ప్రియుడిని చంపిన మహిళ

**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ నగరంలోని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. తనతో పదేళ్లుగా సహజీవనం చేస్తున్న వ్యక్తిని ఓ మహిళ తన కుమారుడితో కలిసి హత్య చేసింది. అనంతరం మృతదేహాన్ని తరలించే ప్రయత్నం చేస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. ఈ సంఘటన చింతల్ అంబేద్కర్‌నగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నమయ్య జిల్లాకు చెందిన శివారెడ్డి (40) అనే వ్యక్తితో అరుణ (35) గత పదేళ్లుగా సహజీవనం చేస్తోంది. ఆమె కుమారుడు సాయిరత్నం (19) కూడా వారితోనే నివసిస్తున్నాడు. అయితే, కొంతకాలంగా శివారెడ్డి.. అరుణను, ఆమె కుమారుడిని వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ వేధింపులు తట్టుకోలేక, అతడిని అంతమొందించాలని తల్లీకొడుకులు నిర్ణయించుకున్నారు.

## పర్యాటక కేంద్రంగా శ్రీకాకుళం తీరం



**పాడేరు, పతాకం న్యూస్:** శ్రీకాకుళం నియోజకవర్గ తీర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా అరుదైన జీవజాతుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈ మేరకు కుందువానిపేటలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ పెంచుతున్న తాబేలు గుడ్లను పొదిగిన పిల్లలను సము ద్రంలోకి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. ప్రతి ఏటా ఈ అరుదైన తాబేళు తీరానికి వచ్చి గుడ్లు పెడుతుంటాయని, అటవీశాఖ, ట్రీ ఫౌండే షన్ సంరక్షిస్తుంటారన్నారు. సుమారు 25 వేల తాబేళ్ల పిల్లలను సురక్షితంగా సముద్రంలోకి విడిచిపెట్టడం ఆనందం వ్యక్తంచేశారు. తాబేళ్ల పిల్లలను సంరక్షిస్తున్న అధికారులు, ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. కుందువానిపేట తీరంలోని సహజ సిద్ధమైన అందా లను పర్యాటకంగా మార్చేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం సహ కారంతో హ్యాచరీలను ఏర్పాటు చేయడంతో పాటు ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మారిస్తే యువత కు ఉపాధి అవకాశాలు కలుగుతా యన్నారు. రానున్న రోజుల్లో వన్య ప్రాణులకు సంరక్షణతో పాటు తీర ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక లు రూపొందిస్తామన్నారు. శ్రీకాకుళం అటవీ రేంజ్ అధికారి ఆర్.రాజశేఖర్ మాట్లాడు తూ.. తాబేళ్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ గుడ్లను సుర క్షితంగా హ్యాచరీల్లో భద్రపరిచి పొదిగిన పిల్లలను ఎటువంటి ప్రమా దం లేకుండా సముద్రంలో విడిచి పెట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్య క్రమంలో ఎఫ్ఎస్‌వోలు బి.అరుణ కుమారి, చక్రధరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మూకళ్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ సూరాడ అప్పన్న, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నత్తనడకన టెక్కలి-తౌలుసూరుపల్లి రోడ్డు పనులు



**టెక్కలి, పతాకం న్యూస్:** టెక్కలి-తౌలుసూరుపల్లి రోడ్డు పనులు నత్తన డకన సాగుతున్నాయి. నెలల తరబడి సీసీ రోడ్డు పనులు జరుగుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గత మూడురోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో ఎన్టీఆర్ కాలనీ నుంచి శ్రీనివాస్‌నగర్ వరకు రోడ్డుపై వరద నిలి చిపోయి బురదమయం అయ్యింది. దీంతో పాదచారులతో పాటు వాహనదా రులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. నెలల తరబడి సీసీ రోడ్డు పనులు జరుగుతుండడం తమ పాలిట శాపంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

## హెల్మెట్ ధరించడం తప్పనిసరి



**సాలూరు, పతాకం న్యూస్:** ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించి ప్రాణాలను రక్షించుకోవాలని సాలూరు సీఐ అప్పలనాయుడు సూచించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌లో హెల్మెట్ ప్రాధాన్యతను ఆయన వివరించారు. హె ల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ.1035 వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించిన వారిని ప్రోత్సహిస్తూ సీఐ కూల్ డ్రింక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు పట్టణ పరిధిలో 65 ఓపెన్ డ్రింకింగ్, 13 ఓవర్ లోడ్, 250 టౌ న్ న్యూసెన్స్ కేసులు నమోదు చేశామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించా లన్నారు.

## మంగంపేట బైరెటీస్ అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలి





**తిరుపతి, పతాకం న్యూస్:** ఎపిఎండిసి మంగంపేట బైరెటీస్ గనులలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర న్యాయ విచారణ చేపట్టాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంగంపేట బేరైటీస్ గనుల పర్యవేక్షణకు మిల్లు యజమానులతోనూ, కార్మిక సంఘాల నేతలతో ఎపి ఎండిసి పరిరక్షణ పోరాట కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న నర్సింగరావుబి మాట్లాడుతూ మంగంపేట గనుల వ్యవహారంలోబి వేల కోట్ల రూపాయల అవినీతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ప్రైవేట్ కంపెనీలకు గనుల కేటాయింపుల రద్దు చేయాలని, వాటి పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని, కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలని, ప్రజా సంపదను రక్షించే విధానాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పలువురు నేతలు మాట్లాడుతూ మంగంపేట బైరెటీస్ వంటి విలువైన ఖనిజాన్ని తక్కువ ధరలకు, ప్రైవేట్ కంపెనీలకు కేటాయించడం వల్ల ప్రభుత్వానికి భారీ నష్టం జరుగుతోందని, ఇది ప్రజాసంపద దోపిడీకి ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక సంఘాలు, మిల్లు యజమానులు, ప్రజాప్రతినిధులు కలిసి పాల్గొని ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా గనుల పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన, స్థానిక ప్రజల జీవనోపాధి రక్షణ కోసం "ఎపి ఎండిసి పరిరక్షణ పోరాట కమిటీ"ని ఎన్నుకున్నారు. ఈ కమిటీకి కన్వీనర్గా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి.అంజయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు జయచంద్ర, నాయకులు పాల్గొన్నారు.

## టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన




**సోంపేట, పతాకం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి ఒడియా మాధ్యమంలో చదివి ఇటీవల వచ్చిన పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఆంధ్రప్రదేశ్ ఒఇయా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) ఆధ్వర్యంలో అభినందించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అపోటా రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ పాడి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఒడియా విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్త కాలు అందించడంతో పాటు సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌లను నియమించి ఒడియా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఒడియా ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆదర్శంగా నిలుస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం మంచి మార్కులు సాధించిన నందిని మహారాణ (590) (ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల), జాస్మినీ బిశ్వాల్ (590) (మందస మండలం చిన్నకోష్ట ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల), ధనుష్ బెహరా (589) (కృష్ణాపురం ఒడియా ఉన్నత పాఠశాల), సంపద గౌడ(589) కార్తీక్ గౌడ (588) (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల)లను సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వక్తలు ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఒడియా డీఐ దుర్గాప్రసాద్ చౌదరి, లింగ్విస్టిక్ మైనారిటీ అధ్య క్షుడు సత్యనారాయణ పాడి, కంచిలి ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్, అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి, పురేంద్ర బిసాయి, ఎస్.వెంకటరావు, కృష్ణచంద్ర మహంతి, ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బెంగాల్‌లో అటవిక పాలనకు చెక్.. ఎన్నికల ఫలితాలపై మంత్రి సత్యకుమార్ హర్షం!



**అమరావతి, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా 4 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. బెంగాల్, అసోంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ఆధిక్యంపై ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంబరాల్లో పాల్గొన్న ఆయన, ఈ ఫలితాలను 'చారిత్రక తీర్పు'గా అభివర్ణించారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ ప్రజలు అటవిక పాలనకు చరమగీతం పాడుతూ స్పష్టమైన తీర్పునిచ్చారని, అసోంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తోందని పేర్కొన్నారు. కేరళలో బీజేపీ ఓట్ షేర్ గణనీయంగా పెరగడం దేశవ్యాప్తంగా మారుతున్న రాజకీయ సమీకరణాలకు నిదర్శనమని ఆయన విశ్లేషించారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు బీజేపీని ఎదుర్కోవడానికి చేతులు కలిపినప్పటికీ, ప్రజలు మాత్రం 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' నినాదానికే పట్టం కట్టారని సత్యకుమార్ తెలిపారు. గత 12 ఏళ్లుగా ప్రధాని మోదీ నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఈ విజయాలకు వెన్నెముక అని పేర్కొన్నారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ విషయంలో 'డిటెక్ట్, డిలీట్, డిపోర్ట్' (గుర్తించడం, తొలగించడం, బహిష్కరించడం) దిశగా బీజేపీ అడుగులు వేయడం ఆ రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమని మంత్రి స్పష్టం చేశారు.

# గోధుమల ధర తగ్గినా దిగిరాని పిండి ధర!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** గోధుమల ధర తగ్గితే ఏమవుతుంది? సహజంగానే గోధుమ పిండి ధర కూడా తగ్గుతుంది. తద్వారా ప్రజలకు ఊరట లభిస్తుంది. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యాప్తంగా గోధుమల ధరలు తగ్గినప్పటికీ దాని ప్రభావం ఎక్కడా కన్పించడం లేదు. రైతులు గోధుమలను కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కంటే తక్కువకే అమ్ముకోవాల్సి వస్తున్నప్పటికీ మార్కెట్‌లో గోధుమ పిండి, బ్రెడ్ ధరలు మాత్రం దిగిరావడం లేదు. ఈ పరస్పర విరుద్ధ పరిస్థితికి కారణమేమిటి? వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ చెబుతున్న దాని ప్రకారం ఇటీవలి కాలంలో గోధుమల ధరలు గణనీయంగా పడిపోయాయి. ఈ నెలలో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలోని హోల్‌సేల్ మండీల్లో కిలో గోధుమల ధర రూ.23 నుంచి రూ.25 మధ్య నడుస్తోంది. చాలా వరకూ కిలో ధర రూ.25.85 పలికినప్పటికీ అది ఎంఎస్‌పీ కంటే తక్కువగానే ఉంది. గత సంవత్సరం నరేంద్ర మోడీ ప్రభుత్వం గోధుమల కనీస మద్దతు ధరను క్వింటాలుకు రూ.160 పెంచి రూ.2,585గా నిర్ణయించింది. 2024-25లో ఇది రూ.2,425గా ఉంది. గోధుమల ధర తగ్గినప్పుడు సహజంగానే పిండి ధర కూడా తగ్గాలి. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యాప్తంగా రిటైల్ మార్కెట్‌లో కిలో గోధుమ పిండి ధర రూ.36 నుంచి రూ.40 మధ్య పలుకుతోంది. బ్రాండెడ్ ఉత్పత్తుల విషయానికి వస్తే కిలో ధర రూ.40 నుంచి రూ.50 మధ్య నడుస్తోంది. అంతకంటే ఎక్కువ వసూలు చేస్తున్న దాఖలాలు కూడా ఉన్నాయి. ఇలా ఎందుకు జరుగుతోంది? ఇది రైతుకు నష్టమా లేక వినియోగదారుడికి లాభమా లేక వినియోగదారుడి పేరుతో వేరెవరైనా లాభాలు గడిస్తున్నారా అన్నదే ఇక్కడ ప్రశ్న. మధ్యవర్తుల వ్యవస్థ వేళ్లూనుకుపోయిందని, దీనంతటికీ కారణం అదేనని ఇండియా టుడే అనుబంధ డిజిటల్ పోర్టల్ కిసాన్‌తక్‌కు చెందిన వ్యవసాయ నిపుణుడు ఓం ప్రకాష్ తెలిపారు. కుటుంబం కడుపు నింపే రొట్టె చౌకగా దొరుకుతుందన్న ఆశ అడియాసే అవుతోందని ఆయన చెప్పారు.

గోధుమల ధర తగ్గడానికి, పిండి ధర పెరగడానికి మధ్య ఉన్న అంతరం సరఫరా వ్యవస్థలోని నిర్మాణాత్మక అసమతుల్యతను బయటపెడుతోంది. మండీ నుంచి మిల్లుకు, అక్కడి నుంచి మార్కెట్‌కు చేరే క్రమంలో గోధుమలు మిల్లింగ్, ప్యాకేజింగ్, బ్రాండింగ్, రవాణా, రిటైల్ పంపిణీ వంటి ప్రక్రియలను దాటాల్సి ఉంటుంది. ప్రతి దశలోనూ ఖర్చులు పెరుగుతుంటాయి. కానీ అంతకంటే ముఖ్యంగా లాభాల మార్జిన్ కూడా పెరుగుతుంది. ముడి సరుకు ధర తగ్గినప్పుడు లాభాల మార్జిన్లు సర్దుబాటు కావు. గోధుమ పిండి ధర పెరిగినప్పుడు మిల్లు యజమానులు, కంపెనీలు ఆ భారాన్ని వినియోగదారుల నెత్తిన వేస్తాయి. కానీ పిండి ధర తగ్గినప్పుడు ధరలను తగ్గించడంలో మీనమేషాలు లెక్కిస్తారు. లాభాల మార్జిన్‌ను కాపాడుకోవడానికి, వీలైతే దానిని మరింతగా పెంచుకోవడానికి వీలుగా వారు ఇలా వ్యవహరిస్తుంటారు. గోధుమల ధరలు ఎందుకు తగ్గుతున్నాయనే ప్రశ్నకు ఓం ప్రకాష్ సమాధానమిస్తూ ఉత్పత్తి పెరుగుతుందన్న అంచనాలు, సరుకు పెద్ద ఎత్తున రావడం, ప్రభుత్వం వద్ద 2.2 కోట్ల టన్నుల నిల్వలు ఉండడం కారణమని చెప్పారు. 'మండీలలో గోధుమ పిండిని తక్కువ ధరకు అమ్ముతున్నారు. అదే మాల్స్‌లో దాని ఖరీదు ఎక్కువగా ఉంటోంది. ఇది కఠోర వాస్తవం. రైతు నష్టపోతుంటే అది వినియోగదారుడికి ఆదాగా మారడం లేదు. మధ్యవర్తులు, బ్రాండెడ్ కంపెనీలు లాభపడుతున్నాయి' అని తెలిపారు. ప్రస్తుతం ప్రముఖ బ్రాండెడ్ సంస్థలు గోధుమ పిండి మార్కెట్‌ను తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటున్నాయి. బ్రాండ్ విలువ, ప్యాకేజింగ్, పంపిణీ వ్యవస్థ వంటి అంశాలు ధరను ప్రభావితం చేస్తున్నాయి. అసంఘటిత రంగంలో పిండి మిల్లులు విద్యుత్ ఛార్జీలు, కార్మికులు, రవాణా వంటి స్థిర ఖర్చులను భరించాల్సి వస్తోంది.

గోధుమల ధర పెరిగినప్పుడు ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంటుంది. నిల్వలపై పరిమితులు నిర్ణయిస్తుంది. ఎగుమతులపై ఆంక్షలు విధిస్తుంది. బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తుంది. ధర ఎంఎస్‌పీ కంటే తక్కువగా ఉన్నప్పుడు సేకరణను పెంచి రైతుల ప్రయోజనాలను కాపాడాలని ప్రయత్నిస్తుంది. అయితే ఈ మద్దతు అనేది రాష్ట్రాలన్నింటిలో ఒకేలా ఉండదు. ఫలితంగా అన్నదాతలు తమ పంటను తక్కువ ధరకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ధరలు తగ్గినా వినియోగదారునికి కలిగే ప్రయోజనం స్వల్పమే. సేకరణ బలహీనంగా ఉన్నప్పుడు రైతులు అయిన కాడికి తమ పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది. అదే సమయంలో రొట్టెల తయారీకి ఉపయోగించే గోధుమ పిండి కోసం వినియోగదారులు గరిష్ట ధరలు చెల్లిస్తూనే ఉన్నారు. పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాలలో గోధుమల సేకరణ ఎక్కువగా జరుగుతుంది. అక్కడి ధరలు ఎంఎస్‌పీకి చేరువగా ఉంటాయి. గోధుమల సేకరణ పరిమితంగా ఉండే రాష్ట్రాలలో మాత్రం ధరలు పడిపోతుంటాయి. ఈ అసమానత రైతులు సంపాదించే దానికి, వినియోగదారుడు చెల్లించే దానికి మధ్య అంతరాన్ని మరింతగా పెంచుతోంది. మార్కెట్ నియంత్రణ సంస్థలు కానీ, ప్రభుత్వం కానీ ఇదేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో ధరల పర్యవేక్షణ విభాగం ఉంటుంది. అయితే అది కేవలం సమాచారాన్ని సేకరిస్తోందా లేక అడ్డూ అదుపూ లేని ధరలను నియంత్రిస్తోందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గోధుమల ధర తగ్గితే రైతుకు గిట్టుబాటు ధర లభించదు. వినియోగదారుడికీ ఉపశమనం కలగదు. మరి ప్రయోజనం పొందేది ఎవరు? మధ్యలో ఉన్న కొద్ది మంది మాత్రమే.

# పన్నుల ద్వారా ఆశించిన స్థాయిలో పెరగని వసూళ్లు

**అమరావతి, పతాకం న్యూస్:** కొత్త ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే రాష్ట్ర ప్రభుత్వానికి నిరాశ ఎదురైంది. పన్నుల ద్వారా ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి అంచనాల మేరకు లభించలేదు. గత ఆర్థిక సంవత్సరపు తొలి నెలతో పోలిస్తే కొంత పెరుగుదల కనిపించినప్పటికీ అది నామమాత్రంగానే ఉండటంతో అధికార యంత్రాంగంలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. దీంతో వాణిజ్య పన్నుల అధికారులు ఈ విషయమై దృష్టి సారించారు. మొదటినెలలో కోల్పోయిన మొత్తంతోపాటు, మిగిలిన నెలల్లోనూ నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను చేరుకునేలా కసరత్తు ప్రారంభించారు. నిర్ధేశించిన ఆదాయ లక్ష్యాలను చేరుకోవడంతో పాటు, వీలైతే ఆ లక్ష్యాలను అధిగమించి వసూళ్లు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల అమలులో భాగంగా అవసరమైతే కఠిన చర్యలు సైతం తీసుకోవాలని భావిస్తున్నారు.

ఆర్థిక సంవత్సరం తొలి నెల అయిన ఏప్రిల్‌లో రు. 5,543 కోట్ల ఆదాయం పనుల ద్వారా ఖజానాకు చేరింది. గత ఏడాది ఇదే నెలలో రు.4,946 కోట్ల ఆదాయం వచ్చింది. అంటే 12.8శాతం పెరుగుదల నమోదైంది. ఈ మొత్తాన్ని కనీసం 25 శాతం పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం! దీనిలో ఐజిఎస్టి రు. 2,194 కోట్లు కాగా, గత ఏడాది ఐజిఎస్‌టి మొత్తం రు. 1,942 కోట్లు గా ఉంది. దీని ప్రకారం ఐజిఎస్‌టిలో 12.97శాతం పెరుగుదల నమోదైనట్టు చెబుతున్నారు. జిఎస్టి వసూళ్ళలో కూడా కేవలం 6.83% మాత్రమే పెరుగుదల కనిపించింది. ఈ ఏడాది ఏప్రిల్ లో 3,797 కోట్లు సమకూరగా గత ఏడాది ఏప్రిల్ లో 3,554 కోట్లు రాగా కేవలం 243 కోట్లు మాత్రమే పెరుగుదల రికార్డయింది. మొత్తం లక్ష్య సాధనలో భాగంగా విడివిడి విభాగాలనుండి వచ్చే ఆదాయాన్ని కూడా పెంచాలని అధికారులు భావిస్తున్నారు. అన్ని పన్నులతో పాటు వృత్తి పన్నుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టమన్నారు ఈ ఏడాది రు. 543 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించారు. ఇది గత ఏడాది లక్ష్యం కన్నా ఏకంగా 45 శాతం ఎక్కువ కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో నిర్ధేశించిన లక్ష్యాలను సాధించే దిశగా ఖజానాని నింపుకునేందుకు కొన్ని చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. సకాలంలో పన్నులు చెల్లించని వారి బ్యాంకు ఖాతాలను జప్తు చేయడం, ఆస్తులను స్వాధీనం చేసుకోవడం, డిఆర్సి ప్రొసీడింగ్స్ అమలువేయడం వంటి చర్యల సాధ్యమైనంత త్వరగా అమలులోకి



తీసుకురావాలని నిర్ణయించారు. ఈ చర్యలు ప్రతిపాదిన దశలో ఉన్నట్లు చెబుతున్నప్పటికీ, ఇప్పటికే కొన్ని చర్యలు అమలు చేస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో విద్యుత్ వినియోగదారులకు, పన్ను చెల్లింపుదారులకు మధ్య అనుసంధానం ఏర్పరచడం ద్వారా మరికొన్ని చర్యలకు సిద్ధమవుతున్నారు. పన్నులు చెల్లింపుదారుల ఖాతాలను డిస్కములకు అనుసంధానం చేస్తూ పన్నులు చెల్లింపులను విద్యుత్ బిల్లులతో కలిపి అధ్యయనం చేయాలని ఆలోచిస్తున్నారు.

పన్ను వినియోగదారుల వివరాలను కస్టమ్స్, జిఎస్‌టి శాఖలకు అనుసంధానం చేయడం ద్వారా వసూళ్లను మరింత పెంచుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన జిఎస్టి, ఐటి, డిఆర్సి విభాగాలతో కూడా సంప్రదింపులు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ విధానాలను అమలు చేయడం ద్వారా మే నెల నుండి నిర్దేశించిన లక్ష్యాలను ఖచ్చి తంగా చేరేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

## జనగణనకు సహకరించాలి

**అమరావతి, పతాకం న్యూస్:** జిల్లాలో ప్రారంభమైన మొదటి దశ జనగణనకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఇంటింటికీ వచ్చే అధికారులకు పూర్తి సమాచారం ఇవ్వాలని ఒక ప్రకటనలో కోరారు. కుటుంబ యజమాని పేరు, ఇంటిలోని వ్యక్తుల పేర్లు, నివాస గృహంలో గదుల సంఖ్య, తాగునీరు, మరుగుదొడ్డి, విద్యుత్ సౌకర్యాలు, వంటగ్యాస్ వివరాలను ఎన్యూమరేటర్లు నమోదు చేయనున్నారని వెల్లడించారు. వారు అడిగే ప్రశ్నలకు జిల్లావాసులు పారదర్శకంగా సమాధానం ఇచ్చిన జనగణన ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ సివిల్ పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం తన కార్యా లయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆసుపత్రుల్లో విద్యుత్, జనరేటర్ల ఏర్పాటు, ప్రహరీల నిర్మాణంపై ఆరా తీశారు. కేవలం గణాంకాలు చెప్పడానికే కాకుండా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని సూచిం చారు. పనుల నాణ్యత, పురోగతిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీవోలు వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఎంహెచ్‌వో నాగభూషణరావు తదితరులున్నారు.

## రాజధానిలో పేదల అభివృద్ధి విస్మరణ



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం రాజధానిలో పేదల సంక్షేమాన్ని విస్మరించి, పెద్దలకు భూములు దోచిపెడుతోందని సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు అన్నారు. ప్రజారాజధానిగా ఉండాలంటే పేదల సంక్షేమానికి చర్యలు చేపట్టాలన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజధానిలోని ఆర్5 జోన్‌లో ఇళ్ల స్థలాలు రద్దయిన పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో సిఆర్‌డిఎ పరిధిలోని గుంటూరు, మంగళగిరి, దుగ్గిరాల, కృష్ణా, ఎన్‌టిఆర్ జిలాల్లోని 50 వేల మంది పేదలకు 900 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించారని, వాటిని ప్రస్తుత ప్రభుత్వం జిఒ 91 ద్వారా రద్దు చేసిందని, వారికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించలేదని గుర్తుచేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని వాగ్దానం చేసిందని, దాని ప్రకారం స్థలాలు రద్దయిన పేదలకు సుమారు రెండు వేల ఎకరాలు కేటాయించాల్సి ఉందన్నారు. రైతుల నుండి సేకరించిన వేలాది ఎకరాలకు తక్కువ ధరకు కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని విమర్శించారు. వివిధ ప్రైవేటు యూనివర్సిటీలకు ఎకరం రూ.50 లక్షలకే కేటాయిస్తూ, ప్రభుత్వ సంస్థలకు మాత్రం నాలుగైదు కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై నేతాజి మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో పేదల ఇళ్ల స్థలాల సమస్యలపై మేలో ఆందోళనలు చేసి, అప్పటికీ స్పందించకపోతే జూన్‌లో మంత్రి లోకేష్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, ఈమని అప్పారావు, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం



**తెనాలి, పతాకం న్యూస్:** తెనాలి చుండూరు రైల్వే మార్గంలో యువకుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఓ వ్యక్తి మృతదేహం రైలు పట్టాలపై పడి ఉన్నట్లు సమాచారం తెలియడంతో తెనాలి జిఆర్పి ఎస్ఐ సరస్వతి ప్రమాద స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కార్తిక్ ఈ ప్రమాదంలో మృతి చెందినట్లు గుర్తించిన పోలీసులు సోమవారం వివరాలు వెల్లడించారు. రైలు నుంచి జారిపడ్డాడా ? రైలు ఢీ కొట్టిందా అన్న కోణంలో విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ సరస్వతి తెలిపారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం పోస్టు కార్డు ఉద్యమానికి శ్రీకారం



**అమరావతి, పతాకం న్యూస్:** దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించే వరకు తమ పోరాటం ఆగదని, కలిసి వచ్చే వ్యక్తులతోనూ శక్తులతోనూ నిరంతర ఉద్యమం కొనసాగిస్తామని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా అధ్యక్షులు యస్.దేవసహాయం, డా.బి.ఆర్. అంబేద్కర్ భవన సాధన కమిటి చైర్మన్ కదిరికోట ఆదెన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జి. ఆనంద్ చైతన్య మాదిగలు పేర్కొన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో ఎస్సీ కాలనీ ఎం.బి.చర్చి దగ్గర దళిత, క్రైస్తవుల ఆధ్వర్యంలో వివిధ దళిత, క్రైస్తవ, విద్యార్థి, యువజన ప్రజా సంఘాల నేతలతో కలిసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, దళితుల మత స్వాతంత్ర్య హక్కును హరించి వేస్తున్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పును విచారణకు రాజ్యాంగ బెంచ్ కు పంపాలని మూడు డిమాండ్లను కనపరిచి గౌరవనీయులైన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారికి పోస్ట్ కార్డులు పంపించారు. రాష్ట్రవ్యాప్తంగా పోస్ట్ కార్డు ఉద్యమానికి ప్రథమంగా ఎమ్మిగనూరు నుండి శ్రీకారం చుట్టామన్నారు. 2026 మార్చి 24న క్రైస్తవ మతంలోకి మారిన దళితులకు రిజర్వేషన్లు వర్తించవని, ఎస్సీ హోదా కోల్పోతారని తీర్పునివ్వడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. భారతదేశంలో మతం మారిన కుల వివక్ష , అణచివేత పోవడం లేదని ఆవేదన చెందారు. దళితులకు మాత్రమే మతం మారే మత స్వేచ్ఛ లేనప్పుడు రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14,15,25 ఇంకెందుకని మండిపడ్డారు. క్రైస్తవ మతం మారిన అగ్రకులాలకు ఈ. డబ్ల్యూ.ఎస్. ద్వారా 10 శాతం రిజర్వేషన్లు విద్యా, ఉద్యోగ రంగాలలో కల్పిస్తున్నప్పుడు, అలాగే క్రైస్తవ మతం మారిన ఎస్టీలకు ఎస్టీ హోదా కొనసాగిస్తున్నప్పుడు క్రైస్తవ మతం మారిన దళితులకు మాత్రం 15 శాతం రిజర్వేషన్లు ఎందుకు వర్తించవని ప్రశ్నించారు. దళిత క్రైస్తవులు ఎస్సీ హోదాను సాధించేవరకు ఐక్య ఉద్యమాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యం.బి. యెరూషలేము చర్చి పాస్టర్ రెవ.జయరాజు బండెల, ఎం.బి.చర్చి జాయింట్ సెక్రెటరీ,అడ్వకేట్ యం.హిజి కియా,నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్.సి.సి.) జిల్లా కార్యదర్శి కదిరికోట వెస్లీ సునీల్, దళిత రచయితల సంఘం (దరసం) వ్యవస్థాపక అధ్యక్షులు ఆరెకంటి భాస్కర్, ఏ.పి.ఎన్జీ జీవో జిల్లా వైస్ ప్రెసిడెంట్ యం. సురేష్ వరప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి యస్.రాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గంజహళ్లి మహదేవ్ మాదిగ, ఉపాధ్యాయులు బి. ప్రసన్న రాజు,అంపయ్య, ఎరుకల కృష్ణ,కదిరికోట సుప్రసాద్, యం.ప్రవీణ్ కుమార్,యం. లోక్ నాథ్, కెవిపిఎస్ నాయకులు సుమాల అంతోని, సుమాల రాజు, డివైఎఫ్ఐ అడ్డాకుల సురేష్, ఎమ్మిగనూరు మండల దళిత నాయకులు గుడికల్ స్వామి దాసు, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొమ్మినేని భోజరాజు,ఆర్.సి.యం చర్చి యూత్ సభ్యులు ప్రవీణ్ కుమార్,రాహుల్,రిటైర్డ్ పోస్ట్ మ్యాన్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్‌లో గ్యాస్ కష్టాలు



**మహబూబాబాద్, పతాకం న్యూస్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీరుతో ప్రజలకు గ్యాస్ కష్టాలు తప్పడం లేదు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో అర్ధరాత్రి నుంచే గ్యాస్ కోసం ఏజెన్సీ ఎదుట వినియోగదారులు క్యూలైన్లలో బారులు తీరి అక్కడే పడుకుంటున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు సరైన సమాధానం ఇవ్వకపోవడం, ఎన్నో రోజులుగా బుకింగ్ చేసినప్పటికీ గ్యాస్ సిలిండర్లు సమయానికి అందకపోవడంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో సమస్య పరిష్కారం కోరుతూ జాతీయ రహదారిపై గ్యాస్ సిలిండర్లు పెట్టి ధర్నా చేపట్టారు.


## స్వచ్ఛతకు సహకరించకపోతే జరిమానాలు, ట్రేడ్ లైసెన్స్ రద్దు..



**కర్నూలు, పతాకం న్యూస్:** నగరంలో ఉన్న వాణిజ్య దుకాణాల వద్ద తప్పనిసరిగా నిర్వాహకులు డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని, స్వచ్ఛతకు సహకరించకపోతే జరిమాన విధింపు, ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. సోమవారం ఉదయం 2వ శానిటేషన్ డివిజన్‌లో మస్టర్ తనిఖీ నిర్వహించారు. కుమ్మరి గేరి, గడియారం ఆసుపత్రి, పెద్ద మార్కెట్, జమ్మిచెట్టు, జొహరపురం, గాంధీనగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పలు దుకాణాల వద్ద డస్ట్‌బిన్‌లు లేకపోవడం, ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉండటంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బంది పరిశుభ్రతపై మరింత పట్టు సాధించాలని, ప్రతి దుకాణం వద్ద తప్పనిసరిగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేసి, 100 శాతం చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాక్టర్ ట్రాలీలను వ్యాపారస్తులు సమర్థవంతంగా వినియోగించుకునేలా చూడాలని సూచించారు. అలాగే వినాయక ఘాట్ వద్ద కేసి కెనాల్‌ను కమిషనర్ పరిశీలించారు. గ్యాంగ్ వర్క్ పెట్టి, శుభ్రం చేయించాలని ఆదేశించారు.

# ఈ లక్షణాలు కనిపిస్తే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం సరిగ్గా లేనట్లే..!

ప్రస్తుత కాలంలో జీవనశైలి మార్పులు, ప్రాసెస్ ఆహారం, ఒత్తిడి, నిద్రలేమి వంటి కారణాలతో ఆరోగ్య సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు ఎక్కువమందిలో కనిపిస్తున్నాయి. చాలా సందర్భాల్లో బయటికి కనిపించే లక్షణాలనే పట్టించుకుంటారు కానీ వాటి మూల కారణం గట్ (జీర్ణ వ్యవస్థ) ఆరోగ్యంతో సంబంధం ఉండొచ్చని గుర్తించరు. అందుకే గట్ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరం. ఇక శరీర ఆరోగ్యానికి గట్ ఎంత ముఖ్యమో కొత్త పరిశోధనలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. సెకండ్ బ్రెయిన్ గా పిలిచే గట్ సరిగా పనిచేయకపోతే, అది కేవలం జీర్ణక్రియకే కాకుండా మెదడు పనితీరు, రోగనిరోధక శక్తి, చర్మ ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. 16వ ప్రోబయోటిక్ సింపోజియంలో నిపుణులు వెల్లడించిన వివరాల ప్రకారం, భారత్‌లో 10 మందిలో 7 మంది ఏదో ఒక గట్ సమస్యతో బాధపడుతున్నారని వెల్లడైంది.



గట్ అసమతుల్యత అనేది చాలా సార్లు స్పష్టంగా కనిపించని లక్షణాల ద్వారా బయటపడుతుంది. వీటిని సాధారణంగా గమనించకుండా వదిలేస్తారు. అయితే ఈ సంకేతాలను ముందుగానే గుర్తిస్తే, ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. గట్ అసమతుల్యతను సూచించే సంకేతాల గురించి వైద్యులు వివరిస్తున్నారు. గట్ అసమతుల్యతకు ఒక ముఖ్య సంకేతం తలలో నిరంతరం చుండ్రు లేదా దురద. గట్‌లో ఇన్‌ఫ్లమేషన్ పెరిగితే అది చర్మంపై కూడా ప్రభావం చూపుతుంది. మంచి బ్యాక్టీరియా, చెడు బ్యాక్టీరియా మధ్య సమతుల్యత కోల్పోతే ఈ సమస్యలు వస్తాయి. అలాగే కారణం తెలియని అలసట కూడా గట్ సమస్యలకు సంకేతంగా నిలుస్తుంది. సరిపడా విశ్రాంతి తీసుకున్నా కూడా అలసటగా అనిపిస్తే, అది శరీరానికి అవసరమైన పోషకాలు సరిగ్గా శోషించకపోవడం వల్ల అవుతుంది.

మూడవ లక్షణం మూడ్ స్వింగ్స్ లేదా ఆందోళన. గట్, మెదడు మధ్య ఉన్న సంబంధం (గట్-బ్రెయిన్ యాక్సిస్) వల్ల గట్ ఆరోగ్యం ప్రభావితం అయితే సెరోటోనిన్ ఉత్పత్తి తగ్గి భావోద్వేగాల్లో మార్పులు వస్తాయి. అలాగే బ్లోటింగ్ (ఉబ్బరం), అసమాన మల విసర్జన కూడా గట్ సమస్యలకు ప్రధాన సంకేతాలు. ఇవి ఇర్రిటబుల్ బవెల్ సిండ్రోమ్ వంటి సమస్యలకు దారితీస్తాయి. ఈ లక్షణాలు నిరంతరం ఉంటే వైద్యులను సంప్రదించడం అవసరం. చక్కెర పట్ల ఆకర్షణ పెరగడం కూడా గట్ అసమతుల్యతకు మరో సూచన. గట్‌లో చెడు బ్యాక్టీరియా పెరిగితే అవి చక్కెరపై ఆధారపడతాయి. దీంతో తీపి తినాలనే కోరిక పెరుగుతుంది. చర్మంపై మొటిమలు లేదా బ్రేకౌట్స్ రావడం కూడా గట్ ఆరోగ్యంతో సంబంధం కలిగి ఉంటుంది.

అధికంగా ప్రాసెస్ ఫుడ్ తీసుకోవడం వల్ల గట్ బలహీనపడి చర్మ సమస్యలు పెరుగుతాయి. తరచూ జలుబు, ఇన్ఫెక్షన్లు రావడం లేదా రోగనిరోధక శక్తి తగ్గడం కూడా గట్ సమస్యల వల్లే జరుగుతుంది. ఎందుకంటే శరీరంలోని 70 ఇమ్యూన్ కణాలు గట్‌లోనే ఉంటాయి. ఇక గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. ఫైబర్ అధికంగా ఉన్న ఆహారం, ఫెర్మెంటెడ్ ఫుడ్స్ తీసుకోవడం, తగినంత నీరు తాగడం అవసరం. అలాగే సరైన నిద్ర, ఒత్తిడి నియంత్రణ, రోజువారీ వ్యాయామం కూడా ముఖ్యమైనవి. గట్ ఆరోగ్యం శరీర మొత్తం ఆరోగ్యానికి పునాది. శరీరం ఇచ్చే చిన్న సంకేతాలను నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైతే వైద్యులను సంప్రదించడం ద్వారా దీర్ఘకాలిక సమస్యలను నివారించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

# శ్రమదానంతో గెడ్డపై వంతెన నిర్మాణం..

## మెచ్చగుడ గ్రామస్థుల్లో వెల్లివిరిసిన చైతన్యం



**అరకులోయ, పతాకం న్యూస్:** మండలంలోని మాడగడ పంచాయతీ మారుమూల గ్రామం మెచ్చగుడ. ఈ గ్రామానికి వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. ఎప్పుడో వేసిన కాలిబాటే చిన్నపాటి రహదారిలా గ్రామస్థులు శ్రమదానంతో మార్చుకున్నారు. వర్షాకాలంలో ఈ రోడ్డుపై జనం, పశువులు జారిపోతుండడంతో విరాళాలు వేసుకొని గ్రావెల్ వేయించుకుని రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. ఇంత చేసినా గ్రామానికి వాహనాలు వచ్చే అవకాశం లేకుండా పోయింది. కారణమేమింటే.. గ్రామ సమీపాన చిన్న గెడ్డ ఉంది. ఇక బైక్‌లు సాహసంతో తీసుకువెళ్లాలి. ఇటువంటి తరుణంలో గ్రామ పెద్దలు, యువకులు పలు మార్లు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోలకు ఎన్నో పర్యాయాలు వినతులు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. ఆ గ్రామంలో 18 కుటుంబాలున్నాయి. వంద మంది జనాభా ఉంది. మరో విశేషం ఏమిటంటే.. గ్రామంలో ఒక వ్యక్తి చనిపోతే పరామర్శకు వచ్చిన నేత గెడ్డ దాటేందుకు గ్రామస్థులు వేసిన పొడవాటి కర్రలపై సాహసం చేసి నడిచి వెళ్లారు.. కాని గ్రామస్థులు నిత్యం ఎదుర్కొంటున్న వంతెన సమస్యపై ఆ నేత పట్టించుకోలేదు. ఇది ఇలా ఉండగా ఏడాది క్రితం వేర్వేరు రోజుల్లో భార్యాభర్తలను ఆసుపత్రికి తీసుకువెళుతుండగానే మృత్యువాత పడ్డారు. అదేవిధంగా నెల రోజుల క్రితం గ్రామానికి చెందిన గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో గ్రామానికి అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వంతమూరు గ్రామానికి డోలీపై తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మాడగడ పీహెచ్‌సీకి గర్భిణిని తరలిస్తుండగానే మార్గమధ్యంలో కవలపిల్లలకు ఆ తల్లి జన్మనిచ్చింది. అయితే ఆసుపత్రికి తరలించగా కవలల్లో ఒకరు మృతి చెందారు. ఈ రెండు సంఘటలు గ్రామస్థులను తీవ్రంగా కలిచివేసింది. ఇలా ఎన్నాళ్లు ప్రాణాలను పోగొట్టుకుంటామని, ఇకపై అటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండాలంటే వంతెనను నిర్మించాలని సంకల్పించారు. దీంతో గ్రామస్థులు ఓ వైపు శ్రమదానంతో పనులు చేస్తునే.. మరోవైపు మెటీరియల్ కోసం విరాళాలు వేసుకొని రూ.నాలుగు లక్షలు సమకూర్చుకొని వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం రెండు వైపులా కాంక్రీట్ గోడలను శ్లాబ్ స్థాయికి నిర్మించారు. మరో పది రోజుల్లో బాటం ఫ్లోర్ కాంక్రీట్ వేయనున్నారు. తర్వాత శ్లాబ్ కాంక్రీట్ వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పగలంతా ఉపాధి హామీ పనులకు వెళ్తూ.. సాయంత్రం వేళలో గ్రామస్థులంతా కలిసికట్టుగా వంతెన దగ్గర పనులు చేస్తున్నారు. ఇటీవల మూడు సార్లు సాయంత్రం కాంక్రీట్ పనులు ప్రారంభించి అర్ధరాత్రి తర్వాత ఒంటి గంట వరకు చేపట్టామని గ్రామస్థులు తెలిపారు. వంతెన పూర్తయితే గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరాన ఉన్న వంతమూరు ప్రాథమిక పాఠశాలకు పిల్లలు ఎటువంటి ఇబ్బంది లేకుండా వెళ్లే అవకాశం ఉంటుంది. అదేవిధంగా వాహనాల రాకపోకలు సజావుగా సాగుతాయని గ్రామస్థులు అంటున్నారు. ఇలా శ్రమదానం, విరాళాలతో నిర్మించిన వంతెన ప్రారంభానికి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోలను ఆహ్వానిస్తామని గ్రామానికి చెందిన కొర్రా సన్యాసిరావు, వంతల రాము, కొర్రా గులాబి తెలిపారు.

# హర్మూజ్ జలసంధిలో 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'.. అమెరికా భారీ ఆపరేషన్



ఇరాన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హర్మూజ్ జలసంధిలో చిక్కుకున్న విదేశీ వాణిజ్య నౌకలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' పేరుతో ప్రత్యేక ఆపరేషన్ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ ఆపరేషన్ ప్రారంభమవుతుందని తెలిపారు. ట్రూత్ సోషల్ వేదికగా ఈ విషయాన్ని ప్రకటించిన ట్రంప్ ఈ వివాదంతో ఏమాత్రం సంబంధం లేని అనేక దేశాల నౌకలు అక్కడ చిక్కుకుపోయాయని పేర్కొన్నారు. వారిని 'అమాయక బాధితులు'గా అభివర్ణించారు. ఆ నౌకల్లోని సిబ్బంది వద్ద ఆహారం, నిత్యావసరాలు అడుగంటుతున్నాయని, ఇది పూర్తిగా మానవతా దృక్పథంతో చేపడుతున్న చర్య అని వివరించారు. ఈ ఆపరేషన్‌కు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) పూర్తి మద్దతు ప్రకటించింది. గైడెడ్-మిసైల్ డిస్ట్రాయర్లు, 100కు పైగా విమానాలు, 15,000 మంది సైనికులు ఇందులో పాల్గొంటారని తెలిపింది. ఇదే సమయంలో, ఈ మానవతా సహాయక చర్యలకు ఎవరైనా అడ్డుతగిలితే తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని ట్రంప్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. మరోవైపు, ఇరాన్‌తో తమ ప్రతినిధులు చాలా సానుకూల చర్చలు జరుపుతున్నారని ట్రంప్ పేర్కొనడం గమనార్హం. అయితే, కొన్ని రోజుల క్రితమే ఇరాన్ ప్రతిపాదించిన 14-సూత్రాల శాంతి ప్రణాళికను ట్రంప్ 'ఆమోదయోగ్యం కాదు' అని తోసిపుచ్చారు. తాజా పరిణామాలపై స్పందించిన ఇరాన్, హర్మూజ్ జలసంధిలో అమెరికా జోక్యాన్ని కాల్పుల విరమణ ఉల్లంఘనగా పరిగణిస్తామని హెచ్చరించింది. ఇజ్రాయిల్ యుద్ధ కాంక్ష ఇప్పట్లో చల్లారేలా లేదు. గాజా, లెబనాన్ పై దాడులతో విరుచుకుపడుతున్న ఇ జ్రాయిల్ మరిన్ని దాడులకు సన్నాహాలు చేసుకుంటుంది. తన ఆయుధ సంపత్తిని ఇంకా భారీగా పెంచుక ్ంటుంది. ఇందులో భాగంగా అమెరికా నుంచి మరిన్ని ఫైటర్ జెట్స్ కొనుగోలు ఒప్పందానికి ప్రధానమంత్రి నెతన్యాహు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.




# ఆర్‌సీబీకి గట్టి షాక్.. గాయంతో జట్టును వీడి స్వదేశానికి పయనమైన స్టార్ ఓపెనర్



ఐపీఎల్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగి మంచి ప్రదర్శన చేస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ గాయం కారణంగా స్వదేశం ఇంగ్లండ్‌కు తిరిగి వెళ్లాడు. చేతి వేలి గాయానికి సంబంధించిన స్కానింగ్, తదుపరి వైద్య పరీక్షల నిమిత్తం అతను ఇంగ్లండ్‌కు పయనమైనట్టు తెలుస్తోంది. ఏప్రిల్ 18న ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫిల్ సాల్ట్ గాయపడ్డాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో బౌండరీ ఆపే ప్రయత్నంలో డైవ్ చేయగా, అతని ఎడమచేతి వేలికి గాయమైంది. ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్‌ఫో కథనం ప్రకారం, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డ్ (ఈసీబీ) సూచన మేరకే సాల్ట్ స్వదేశానికి వెళ్లాడు. ఈ గాయం కారణంగానే అతను గత మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు.

ఈ సీజన్‌లో ఫిల్ సాల్ట్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఆడిన 6 ఇన్నింగ్స్‌లలో 168.33 స్ట్రైక్ రేట్‌తో 202 పరుగులు చేసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. సాల్ట్ స్థానంలో ప్రస్తుతం విరాట్ కోహ్లీతో కలిసి మరో ఇంగ్లండ్ ఆటగాడు జాకబ్ బెథెల్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నాడు. గాయం తీవ్రతను బట్టి సాల్ట్ తిరిగి వచ్చే అవకాశం ఉంటుందని, అప్పటివరకు అతని స్థానంలో వేరొకరిని తీసుకునే ఆలోచన ఫ్రాంచైజీకి లేదని సమాచారం. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో పంజాబ్ కింగ్స్ తర్వాత రెండో స్థానంలో ఉన్న ఆర్‌సీబీ, తన తదుపరి మ్యాచ్‌ను లక్నో సూపర్ జెయింట్స్‌తో గురువారం ఆడనుంది.

## ఉత్కంఠ పోరులో..

# గుజరాత్ టైటాన్స్ విజయం



స్వల్ప ఛేదనే అయినా ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆఖరి ఓవర్‌లో గట్టెక్కింది. అటు తమ బ్యాటర్లు విఫలమైన చోట పంజాబ్ బౌలర్లు పోరాడినా ఫలితం దక్కలేదు. సాయి సుదర్శన్ (41 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 57), వాషింగ్టన్ సుందర్ (23 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 40 నాటౌ ట్) కీలక ఇన్నింగ్స్‌తో గుజరాత్‌ను ఆదుకున్నారు. ఈ మ్యాచ్‌లో గుజరాత్ 4 వికెట్లతో నెగ్గింది. పంజాబ్‌కిది వరుసగా రెండో ఓటమి కాగా.. టైటాన్స్‌కు హ్యాట్రిక్ గెలుపు. ముందుగా పంజాబ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 163 పరుగులు చేసింది. సూర్యాన్ష్ షెడ్గే (29 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 57), స్టొయినిస్ (31 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 40) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' హోల్డర్‌కు 4.. రబాడ, సిరాజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో గుజరాత్ 19.5 ఓవర్లలో 167/6 స్కోరు చేసి గెలిచింది. అర్ష్‌దీప్, వైశాక్‌లకు రెండేసి వికెట్లు లభించాయి. కెప్టెన్ గిల్ (5) విఫలమైనా.. సుదర్శన్, బట్లర్ (26) రెండో వికెట్‌కు 53 రన్స్ జోడించారు. అయితే ఆఖర్లో పంజాబ్ పట్టు బిగించడంతో కాస్త ఉత్కంఠ నెలకొంది. 6 బంతుల్లో 11 పరుగులు కావాల్సిన వేళ ఐదో బంతిని సుందర్ సిక్సర్‌గా మలచి మ్యాచ్‌ను ముగించాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఈ సీజన్‌లో తొలిసారి తడబడింది. పేసర్లు హోల్డర్, రబాడ, సిరాజ్‌ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన వేళ.. సూర్యాన్ష్, స్టొయినిస్ అద్భుతంగా ఆదుకున్నారు. దీంతో జట్టు కాస్త సవాల్ విసిరే స్కోరు చేయగలిగింది. ముందుగా భీకర ఫామ్‌లో ఉన్న ఓపెనర్ ప్రియాన్ష్ (2), కూపర్ (0)లను సిరాజ్ తొలి ఓవర్‌లోనే వెనక్కిపంపాడు. కెప్టెన్ శ్రేయాస్ (19), ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (15) కొద్దిసేపు క్రీజులో నిలిచి మూడో వికెట్‌కు 33 రన్స్ జోడించారు. అటు పరుగులు రావడం కూడా కష్టంగా మారగా.. 47/5 స్కోరుతో పంజాబ్ తీవ్ర కష్టాల్లో పడింది. ఈ దశలో సూర్యాన్ష్ ఎదురుదాడికి దిగాడు. అతడికి స్టొయినిస్ సహకరించడంతో స్కోరుబోర్డులో కదలిక వచ్చింది. 14వ ఓవర్‌లో సూర్యాన్ష్ 6,6,4,4,6తో 27 రన్స్ రాబట్టగా జట్టు స్కోరు వంద దాటింది. దీంతో అతను 24 బంతుల్లోనే తన తొలి హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కానీ 16వ ఓవర్లో సూర్యాన్ష్‌ను రబాడ అవుట్ చేయడంతో ఆరో వికెట్‌కు 79 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఇక 18వ ఓవర్‌లో స్టొయినిస్, బార్ట్‌లెట్ (0)లను వరుస బంతుల్లో హోల్డర్ పెవిలియన్‌కు చేర్చి ప్రత్యర్థి పరుగుల వేగానికి బ్రేక్ వేశాడు. ఆఖరి ఓవర్‌లో యాన్సెన్ (20) 6,4తో 14 పరుగులు రాగా, జట్టు స్కోరు కూడా 160 దాటింది.

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) బార్ట్‌లెట్ (బి) వైశాక్ 57, గిల్ (సి) కూపర్ (బి) అర్ష్‌దీప్ 5, బట్లర్ (సి) శ్రేయాస్ (బి) వైశాక్ 26, నిషాంత్ (సి) వైశాక్ (బి) స్టొయినిస్ 15, వాషింగ్టన్ (నాటౌట్) 40, తెవాటియా (సి) బట్లర్ (బి) యాన్సెన్ 2, హోల్డర్ (సి) కూపర్ (బి) అర్ష్‌దీప్ 5, అర్షద్ (నాటౌట్) 8, ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 19.5 ఓవర్లలో 167/6; వికెట్ల పతనం: 1-16, 2-69, 3-94, 4-124, 5-140, 6-152; బౌలింగ్: బార్ట్‌లెట్ 4-0-38-0, అర్ష్‌దీప్ 4-0-24-2, యాన్సెన్ 4-0-33-1, వైశాక్ 4-0-31-2, స్టొయినిస్ 2.5-0-26-1, చాహల్ 1-0-13-0.




# 15న 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'



త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ, అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న ఫన్ ఫిల్డ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' . ఈ చిత్ర విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. మధుదీప్ చెలికాని రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని లోటస్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అరవింద్ మండ్యం నిర్మించారు. సిహెచ్.వి.ఎస్.ఎన్. బాబ్జీ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ప్రమోషనల్ కంటెంట్ మంచి స్పందనను రాబట్టుకోగా, సినిమాను మే 15న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లుగా మేకర్స్ తెలియజేశారు. శ్రీ వెంకట సాయి ఫిల్మ్స్ ముత్యాల రామదాస్ డిస్ట్రిబ్యూషన్‌లో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యేందుకు సిద్ధమవుతోంది.

ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ.. ఫ్యూచర్‌లో వర్క్ ఫ్రమ్ హోమ్ ఎలా ఉండబోతోందనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో ఈ సినిమా చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుందని తెలిపారు. అంతేకాదు, ఒక అందమైన ప్రేమకథ కూడా ఇందులో ఉందని, ప్రేక్షకులను ఆకర్షించేలా ఈ ప్రేమకథను దర్శకుడు డిజైన్ చేశారని అన్నారు. నిజాయితీ గల అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకుంటే ఆ ప్రయాణం ఎంత వినోదాత్మకంగా ఉంటుందో ఈ సినిమాలో దర్శకుడు అద్భుతంగా చూపించబోతున్నారని, ఈ హృద్యమైన కుటుంబ కథా చిత్రం సమ్మర్‌లో ప్రేక్షకులకు సంపూర్ణ వినోదాన్ని అందిస్తుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. నెల్లూరు సుదర్శన్, హర్ష చెముడు, గుండు సుదర్శన్ వంటి వారు ఇతర ముఖ్య పాత్రలలో కనిపించనున్నారు. త్వరలోనే ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించనున్నారు. మూవీ త్రిగుణ్ కెరీర్‌కు ఎంతో కీలకమనే విషయం తెలియంది కాదు. ఈ సినిమాతో ఎలాగైనా హిట్ అందుకుంటానని ఆయన కూడా చెబుతున్నారు. చూద్దాం.. మే 15న ఏం జరుగుతుందో?

# హీరోయిన్ మమితా బైజుకి బ్యాడ్ టైమ్ స్టార్ట్ అయ్యినట్టుందే!



2024 లో వచ్చిన ప్రేమలు చిత్రంతో అటు మలయాళంతో పాటు, తెలుగు, తమిళ భాషల్లో రీసూగా కుర్రాళ్ల గుండెల్లో గూడు కట్టుకున్న మలయాళ ముద్దుగుమ్మ మమితా బైజు. ఆ చిత్రం కన్నా ముందు చాలా చిత్రాలు చేసిన అవి కేవలం అమ్మడిని మలయాళ ఇండస్ట్రీకే పరిమితం చేశాయి. కానీ ప్రేమలు చిత్రం అమ్మడి కెరీర్‌కు మంచి బూస్టప్‌ను ఇచ్చింది. ఆ బూస్టప్ ఇప్పుడు తమిళ, మలయాళ టాప్ స్టార్స్ తో అవకాశాలను తెచ్చిపెడుతుంది. అయితే ఈ ఏడాది అమ్మడు టైమింగ్ అస్సలు బాగున్నట్లు కనిపించట్లేదు. మరి ఇది అమ్మడి కెరీర్‌ను ప్రమాదంలో నెట్టే అవకాశం ఉందా..?

ప్రేమలు అందించిన జోష్‌తో గతేడాది ప్రదీప్ రంగనాథన్‌తో కలిసి డ్యూడ్ సినిమాతో మరో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. అయితే ఇక్కడే ఒక చిన్న ట్విస్ట్ ఉంది. ఆ సినిమా హిట్ క్రెడిట్ అంతా హీరో ప్రదీప్ ఖాతాలోకి వెళ్ళిపోయింది కానీ, మమితాకు ఆశించిన స్థాయిలో మైలేజ్ రాలేదు. ఈ ఏడాది దళపతి విజయ్‌తో నటించిన జననాయగన్ సినిమాపై మమితా చాలా ఆశలే పెట్టుకుంది. సెన్సార్ ఇబ్బందుల వల్ల ఆ సినిమా వాయిదా పడుతూ వస్తోంది. ఇక రీసెంట్‌గా కోలీవుడ్ స్టార్ ధనుష్ సరసన కర మూవీతో పలకరించింది. ఏప్రిల్ 30న భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద పెద్దగా సౌండ్ చేయలేక పోయింది. మమితా పెర్ఫార్మెన్స్‌కు మంచి మార్కులే పడినా, సినిమా రిజల్ట్ మాత్రం ఆమె కెరీర్‌కు స్పీడ్ బ్రేకర్ లాగే మారింది.

ఇక ఇప్పుడు అందరి దృష్టి అమ్మడి టాలీవుడ్ ఎంట్రీపైనే ఉంది. విశ్వనాథం అండ్ సన్స్ సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించబోతోంది మమితా. టీజర్‌లో ఆమె లుక్స్ అద్భుతంగా ఉన్నాయి. అంతేకాకుండా సినిమాపై పాజిటివ్ వైబ్స్ కనిపిస్తున్నాయి. కానీ ఇక్కడే ఒక పెద్ద రిస్క్ దాగి ఉంది. ఈ సినిమాలో మమితా 20 ఏళ్ల అమ్మాయిగా నటిస్తూ.. 40 ఏళ్ల వయసున్న సూర్యతో ప్రేమాయణం సాగించే పాత్రలో కనిపిస్తోంది.

# విజయ్ 'జన నాయగన్' లీక్... నిర్మాతలకు ఎంత నష్టమో తెలుసా?



కోలీవుడ్ స్టార్ హీరో, దళపతి విజయ్ చివరి చిత్రం 'జన నాయగన్' విడుదలకు ముందే భారీ సంక్షోభంలో చిక్కుకుంది. సినిమా పూర్తి హెచ్‌డీ ప్రింట్ ఆన్‌లైన్‌లో లీక్ కావడంతో నిర్మాతలు సుమారు రూ.70 కోట్ల మేర నష్టపోయినట్లు అంచనా వేస్తున్నారు. ఈ పరిణామం కోలీవుడ్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. హెచ్. వినోద్ దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామా ఏప్రిల్ 9న పైరసీకి గురైంది. దీని ఫలితంగా, సినిమా పోస్ట్-థియేట్రికల్ హక్కుల కోసం ప్రముఖ ఓటీటీ సంస్థ ప్రైమ్ వీడియోతో కుదుర్చుకున్న రూ.120 కోట్ల భారీ ఒప్పందం రద్దయింది. లీక్ తర్వాత నిర్మాతలు మరో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ను సంప్రదించగా, కేవలం రూ.50 కోట్ల ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ డీల్ విలువ పడిపోవడంతోనే నిర్మాతలకు పెద్ద దెబ్బ తగిలింది.

ఈ ఘటనపై చిత్ర యూనిట్ చట్టపరమైన చర్యలు ప్రారంభించింది. లీకైన కంటెంట్‌ను షేర్ చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. పైరసీని తీవ్రంగా ఖండిస్తూ చిరంజీవి, శివకార్తికేయన్, జీవీ ప్రకాశ్ కుమార్, కార్తీక్ సుబ్బరాజ్ వంటి సినీ ప్రముఖులు చిత్ర బృందా నికి మద్దతుగా నిలిచారు. సినిమాను థియేటర్లలోనే చూసి గౌరవించాలని కో రారు. విజయ్ పూర్తిస్థాయి రాజకీయ ప్రవేశానికి ముందు ఇదే చివరి సినిమా కావచ్చనే ప్రచారంతో 'జన నాయగన్'పై భారీ అంచనాలున్నాయి. సెన్సార్, ఇతర కారణాలతో పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రాన్ని మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**